ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 31 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆది) సా.6.24
సహరి(సోమ) ఉ.4.36

ఎండా కాలమ్
	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.0	23.0


నీరాజనం : ప్రజలకు అభివాదం చేస్తున్న పవన్


పవన్ రాకకు ముందుగానే మేడెక్కిన అభిమానం


అన్నా.. నీ కోసమే..


నేను మీ వాడిని : పవన్ అభివాదం
పిఠాపురాన తొలి రోజు ప్రచార సభకు హాజరైన జనప్రవాహం

జన..పవన్..

ఆశీర్వదించండి..పిఠాపురాన లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించండి

- నియోజకవర్గాన్ని తీర్చిదిద్దే బాధ్యత నాది
- రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా చేస్తా
- ఇక్కడే స్థలం కొంటా.. ఇల్లు కట్టుకుంటా
- నన్ను ఓడించేందుకు వైసీపీకి ఎందుకంత కక్ష
- ఓట్లకు వచ్చే వైసీపీ నేతలను నిలదీయండి
- తొలిరోజు ప్రచార సభలో నిప్పులు చెరిగిన పవన్






పవన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉదయ్ శ్రీనివాస్, పంతం నానాజీ, కొత్తపల్లి సుబ్బారాయుడు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి), పిఠాపురం, గొల్లప్రోలు రూరల్, మార్చి 30 : 'పిఠాపురం నియోజకవర్గానికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. దేశం గర్వించదగ్గ ఆలయాలు ఇక్కడే ఉన్నాయి. ఒక పక్క పోర్టులు, సెజ్, సముద్రం, హైవే ఇన్ని ఉన్నా నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. అందుకే పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. ప్రతి మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు తీసుకువస్తా. నాకు ఎందరో వైద్యులైన స్నేహితులు ఉన్నారు. వారితో ఇక్కడ ఆస్పత్రులు నెలకొల్పేలా చేస్తా. కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు తీసుకువచ్చేలా చేస్తా. ఒకసారి ఈప్రాంతం నాది అనుకున్నానంటే దాని అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తా. పిఠాపురంలో ఉన్న ఆలయాలను అన్నింటినీ కలిపి టెంపుల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తా. అందుకే నేను ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని తెలిసి వైసీపీ నన్ను ఓడించడానికి ఎన్ని కుట్రలు పన్నాలో అన్నీ పన్నుతోంది. నాపై ఎందుకు ఇంత కక్ష. మీరంతా అండగా ఉన్నారనే నాపై ఇన్ని వ్యూహాలు అమలు చేస్తోంది. అందుకే చేతులు జోడించి అభ్యర్థిస్తున్నా. పిఠాపురం నుంచి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపండి. లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించండి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి పవన్ పిఠాపురం నియోజకవర్గంలో శనివారం నుంచి పర్యటన ప్రారంభించారు. నాకు ఇష్టమైన దత్తాత్రేయుడి సాక్షిగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాను. ఎలా చేస్తాను అనే సందేహం మీలో చాలా మందికి ఉండొచ్చు. అనుభవజ్ఞుడైన టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ సహకారం, ఇతర నేతలతో నియోజకవర్గాన్ని ముందుకు నడిపిస్తా. ఇక్కడున్న ఆలయాలను కేంద్రంతో మాట్లాడి ప్రత్యేక పథకం కింద నిధులు తెస్తాను. ఉప్పాడ కోత నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాను. కానీ వైసీపీ వాళ్లు ఇవేవీ చేయలేదు. నేను పోటీ చేస్తున్నాను అనగానే నేతలందరూ ఊరూరా తిరుగుతున్నారు. ఎందుకు ఇన్నాళ్లు ఈ ప్రాంతాన్ని వాళ్లు అభివృద్ధి చేయలేదు. వంగా గీత వస్తే ఇదే నిలదీయండి. సెజ్‌లో పరిశ్రమలు ఎందుకు లేవని అడగండి. అరబిందో చేపడుతున్న పైపులైన్ కాలుష్యం గురించి నిలదీయండి. జెట్టీలు ఎందుకు లేవో అడగండి. వైసీపీ అంతా బెదిరింపుల రాజ్యం. కాకినాడలో రెండు పోర్టులను అరబిందో ద్వారా అధికార పెద్దలు లాగేసుకున్నారు. కాకినాడ పోర్టులో కంటైనర్లలో డబ్బులను వైసీపీ నేతలు దాచారు. జిల్లాలో ఉన్న మాఫియా డాన్ చెరువుల్లో మట్టి, బొండు ఇసుక, పోర్టు భూములు ఇలా అన్నింటిని మింగేశాడు. అతడి పేరు పలకడం కూడా నాకు ఇష్టం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి సంగతి చూద్దాం. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇక్కడ అన్నివర్గాల సమస్యలు తీరుస్తా. చేనేత, మత్స్యకారుల సమస్యల దగ్గర నుంచి యువతకు స్కిల్ సెంటర్లు, మిర్చి రైతుల కష్టాలు, సంతకు మౌలిక వసతులు ఇలా అన్ని సమస్యలు పరిష్కరిస్తాను. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అమాయకులైన ప్రజల భావోద్వేగాలతో ఇంతవరకు నేతలు ఆడుకున్నారు. కానీ నేను అలా కాదు. బాధ్యతతో వ్యవహరించి ఇక్కడి ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటాను. అందుకే నన్ను ఆశీర్వదించండి. అసెంబ్లీకి పంపం డి.'అని పవన్ కోరారు.పవన్ ఉదయంనుంచి జ్వ రంతో బాధపడు తున్నారు. ఆయన ఆదివారం పుర్హూతికా అమ్మవారిని దర్శించుకుని వారాహికి పూజలు చేస్తారు. పర్యటనలో కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వర్మ, బీజేపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా కృష్ణరాజు ఉమ్మడి శ్రేణులు పాల్గొన్నారు.



అడుగడుగునా నీరాజనం.. పోలీసుల వైఫల్యం

తొలిరోజు పవన్‌కు అడుగడుగునా నీరాజనం పలికారు.సరిగ్గా మధ్యాహ్నం 12.40 గంటలకు గొల్లప్రోలులో హెలీప్యాడ్ వద్ద దిగారు. అక్కడ టీడీపీ, జనసేన నేతలు పవన్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పుర్హూతికా అమ్మవారి దర్శనానికి వెళ్లాల్సి ఉండగా సమయాభావంవల్ల ఆలయం మూతపడింది. దీంతో దొంతమూరులో మాజీ ఎమ్మెల్యే వర్మ ఇంటికి వెళ్లి సుమారు గంట సేపు గడిపారు. అనంతరం పవన్ నేరుగా హోటల్‌లో బస ప్రాంతానికి చేరుకున్నారు. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు జగ్గంపేట నుంచి వచ్చిన ఉద్యమనేత తుమ్మలపల్లి రమేష్ పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. అనంతరం పుర్హూ తికా అమ్మవారి ఆలయానికి వెళ్లి అక్కడే వారాహికి పూజలు చేద్దామని పవన్ భావించారు. తీరా వారాహికి ఎన్నికల ప్రచార రథం కింద అనుమతులు లేవని అధికారులు అభ్యంతరం చెప్పడంతో దర్శనం కూడా రద్దు చేసుకున్నారు. అక్కడి నుంచి చేబ్రోలుకు బయలుదేరారు. దారిపొడవునా వందలాది జనం పవన్ వెంట నడిచారు. హారతులు పట్టారు. రాత్రి 8 గంటలకు చేబ్రోలుకు చేరుకునేసరికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ వారాహికి అనుమతులు జారీ చేసింది. దీంతో అప్పటికప్పుడు వారాహి ఎక్కి ప్రజలకు అభివాదం చేసుకుంటూ 8.30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు.అప్పటికే వేలాది మంది పవన్ రాక కోసం చూడడం, అదే సమయంలో వారాహి ముందుకు కదలడంతో ఒక్కసారి అనుకోకుండా తొక్కిసలాట చోటుచేసుకుని పలువురికి గాయాలయ్యాయి. ఆ తర్వాత పవన్ వారాహిపైకి ఎక్కి దాదాపు గంట సమయం ప్రసంగించడంతో అభిమానులు ఆనందంతో మునిగిపోయారు. పవన్‌కల్యాణ్ సభ సమయంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ఉదయం 150 మంది పోలీసులతో భద్రత ఉంటుందని తెలియజేసినా రాత్రికి 20మంది కూడా లేకపోవడం గమనార్హం.దీనివల్లే తొక్కిసలాట జరిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


మీ భవిష్యత్‌కు నేనున్నా : వర్మ కుటుంబీకులతో జనసేన అధినేత పవన్

వర్మకు అండగా ఉంటా..

పిఠాపురంలో పవన్‌కల్యాణ్

పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 30: పొత్తులో భాగంగా తన కోసం సీటు త్యాగం చేసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మను భవిష్యత్తులో బలమైన స్థానంలో నిలుపుతామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన అనంతరం నియోజకవర్గానికి శనివారం తొలిసారి పవన్ వచ్చారు. హెలికాప్టర్ దిగి నేరుగా పిఠాపురం మండలం పి.దొంతమూరులోని వర్మ నివాసానికి చేరుకున్నారు. తప్పెటగుళ్ల బాణ సంచా కాల్పులు, డప్పుల వాయిద్యాలతో పవన్‌కు స్వాగతం పలికారు.వర్మను ఆలింగనం చేసుకుని సత్కరించారు. వర్మ సతీమణి లక్ష్మీదేవి పవన్‌కు హారతులు ఇచ్చారు. అనంతరం కుమారుడు గిరీష్, ఇతర కుటుంబీకులతో మాట్లాడారు. వర్మ తల్లి అలివేలు మంగ పద్మావతి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వర్మ, జోన్-2 ఇన్‌చార్జి, మాజీ మంత్రి సుజయ కృష్ణరంగారావుతో అరగంటకుపైగా సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులు, పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై చర్చించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం సాధించబోతున్నదన్నారు. దానికి సంకేతమే పిఠాపురం నియోజకవర్గంలో లభిస్తున్న అపూర్వ స్పందన అన్నారు. తన విజయం కోసం నేనున్నాంటూ నిలబడిన వర్మకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్మకు అన్ని విధాలా అండగా ఉంటానని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం కుటుంబం తరపున పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్నామని తెలిపారు.తన కంటే పదిరెట్లు అధికంగా కష్టపడి పవన్ విజయం కోసం పనిచేస్తామని చెప్పారు. పిఠాపురంలో టీడీపీ, జనసేన జెండా ఎగరాలన్నారు.కార్యక్రమంలో కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.


మీ విజయం ఖాయం : పవన్‌ను ఆశీర్వదిస్తున్న పండితులు


మా సమస్యలు వినన్నా : పవన్ కోసం వచ్చిన పట్టు పరిశ్రమ రైతులు

రూ.23.44 లక్షలు సీజ్..

ఆధారాలు చూపిన 21.44 లక్షలు విడుదల : కలెక్టర్

రాజమహేంద్రవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్నికల నిఘాలో భాగంగా ఎస్‌కోర్ బృందాల ద్వారా ఇప్పటి వరకూ 13 మంది నుంచి రూ.23.44 లక్షలు సీజ్ చేసి.. ఆధారాలు చూపిన తర్వాత రూ.21.44 లక్షలు విడుదల చేసినట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం జిల్లాలోని ఎన్నికల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిడదవోలులో రూ.12.88 లక్షలు, రాజమహేంద్రవరం అర్బన్‌లో రూ.2.65 లక్షలు, గోపాలపురంలో రూ.4 లక్షలు, అనపర్తితో రూ.1.06 లక్షలు, రాజమహేంద్రవరం రూరల్‌లో రూ.1 లక్ష, రాజానగరంలో రూ.1.85 లక్షలు, సీజ్ చేశామన్నారు. ఆధారాలు చూపడంతో 11 మందికి సంబంధించిన రూ.23,43,550 లు విడుదల చేసినట్టు చెప్పారు.రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు ఉంటే స్వాధీనం చేసుకుంటారని చెప్పారు. ఎన్నికల ఫిర్యాదులకు 1950 టోల్‌ఫ్రీ నంబర్‌తో పాటు కలెక్టరేట్‌లో 1800 425 2540 నెంబర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సీ విజిల్ ద్వారా 27 ఫిర్యాదులు రాగా 18 పరిష్కరించామన్నారు.

9 మంది వలంటీర్లు రాజీనామా

కడియం, మార్చి 30: కడియం మండలంలో 9 మంది గ్రామ వలంటీర్లు వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్టు ఎంపీడీవో జి.రాజమనోజ్ తెలిపారు. కడియం గ్రామానికి చెందిన ఏడుగురు బత్తిన శ్రీధర్, నాతి జ్యోత్స్న, మేడిశెట్టి రామలక్ష్మి, వంతు సాయికుమార్, కడియం లక్ష్మీదుర్గ, కాసాని గౌతమి, వరదా సత్యసాయిశిరీష, కడియపులంకకు చెందిన జి.దుర్గామణికంఠ ప్రసాద్, వేమగిరికి చెందిన పలివెల నాగేశ్వరరావు రాజీనామా చేశారన్నారు. వారంతా వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్టు తెలిపారని ఎంపీడీవో రాజమనోజ్ పేర్కొన్నారు.



అరెటికి.. ఏమైంది!

ధర లేక రైతు దిగాలు

- కర్పూర గెల ఒకటి రూ.100లోపే
- లాభసాటిగా లేని పంట
- గెలలు చేలోనే వదిలేస్తున్న రైతులు
- బహిరంగ మార్కెట్‌లో తగ్గని ధర
- బొంత అరటిపై కూరల ప్రభావం
- చక్కెరకేళికి తగ్గని డిమాండ్

పెరవలి, మార్చి 30 : అరె ఏమైంది.. అరటి ధర దిగజారింది.. ప్రస్తుతం పది టన్నుల కర్పూర అరటి గెలల రేటు రూ. 70 వేల నుంచి రూ.80 వేల వరకు పలుకుతోంది. అయితే ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు గెలలు కోసేందుకు ఆసక్తి చూపడంలేదు. చాలా మంది రైతులు గెలలను కోయకుండా తోటల్లో వదిలి వేస్తున్నారు. కరోనా తర్వాత అరటి ధర అంతంతమాత్రంగానే ఉంది. అడపాదడపా తప్ప ధర ఆశాజనంగా లేదు. గత రెండు, మూడేళ్లుగా అరటి తోటల పరిస్థితి ఇదేవిధంగా ఉండడంతో సాగుపై చాలా మంది రైతులు అనాసక్తి చూపుతున్నారు. ఏడాదిలో పండుగ సమయాల్లో రెండు, మూడు సార్లు మాత్రమే పది రోజులు పాటు రేటు అధికంగా ఉంటుందని.. మిగిలిన సమయాల్లో దిగజారిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తోటలు వేస్తే కనీసం పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఎకరం అరటి తోట సాగు చేసేందుకు సుమారు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చవుతుంది. వెదురు కొనుగోలు చేస్తే మరో రూ.50 వేలు అదనం. గెల ఒక్కింటికి రూ. 200 నుంచి రూ.250 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తే తమకు లాభం ఉంటుందని రైతులు చెబుతున్నారు. కానీ తరచూ మార్కెట్‌లో ఒడిదుడుకులు వల్ల ప్రస్తుతం వంద రూపాయలకు కూడా కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో రైతులు లబోదిబోమం టున్నారు. గతంలో గెల ఒక్కటి రూ.150 నుంచి రూ.200 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్ లేకపోవడం వల్ల వాటిని కూడా కోయకుండా వదిలివేస్తున్నారు. అరటి తోటలు విషయమై ప్రభుత్వం ఎటువంటి శ్రద్ధ తీసుకోకపోవడంతో తరచూ నష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. అయితే బహిరంగ మార్కెట్‌లో మాత్రం ధర తగ్గలేదు. డజను రూ. 30 నుంచి రూ.40లకు విక్రయిస్తున్నారు. చక్కర కేళి అరటి ధర మాత్రం ఆశాజన కంగానే ఉంది. అయితే చక్కరకేళి సాగు తక్కువగా ఉంటుంది. అయితే చక్కరకేళీ అరటి పండును ఎక్కువగా ఇష్టపడతారు.డిమాండ్ తగిన ఉత్పత్తి లేకపోవడంతో ఎప్పుడూ ధర ఆశాజ నకంగా ఉంటుంది. అదే విధంగా బొంత అరటి ధర తక్కువగానే ఉంది. కూరగాయల ధరల ప్రభావం బొంత అరటిపై పడింది.

నాలుగేళ్లుగా నష్టమే..



అరటి తోటలతో పూర్తిగా నష్టపోతున్నాం. అలవాటైన పంట కాబట్టి అరటి సాగును వదులుకోలేకపోతున్నాం. గత నాలుగేళ్లుగా నష్టాలతోనే అరటి తోటలు సాగు చేస్తున్నాం. ప్రభుత్వం వెదురుగెడలను రైతులకు సబ్సిడీపై సరఫరా చేసి ఆదుకోవాలి. మద్దతు ధర వచ్చేలా చూడాలి.

- నారాయణరావు, రైతు, తీపర్రు

తీళ్లు..మారరా!

కోడ్ వచ్చినా.. ఇష్టానుసారంగా..


వీధివీధినా ఇంతేగా : సీతానగరంలో ఇంటికి గోడకు.. గేటుకు అతికించిన వైసీపీ స్టిక్కర్లు

సీతానగరం, మార్చి 30 : కోడ్ కూసినా వైసీపీ నాయకుల్లోమాత్రం మార్పు కానరావడంలేదు.. ఎన్నికల కమిషన్ వద్దన్నా అవే పనులు చేస్తున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో నాయకుల చిత్రపటాలు కనిపించకూడదని ప్రభుత్వ కార్యాలయాల్లోనే తొల గించారు...ఈ మేరకు బహిరంగ ప్రదేశాల్లో కటౌట్లు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగించారు. అయినా వైసీపీ నాయకులు మాత్రం అంతా మా ఇష్టం అంటున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన స్టిక్కర్లు మాత్రం ఎక్కడబడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలో సీఎం జగన్.. ఎమ్మెల్యే రాజా చిత్రాలతో గోడలు.. గేట్లకు అతికించిన ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. ఎన్నికల షెడ్యూలు విడుదలైనా వారేం పట్టించుకోవడం లేదు. తమ దారి తమదే అంటున్నారు. వీళ్ల ఏమైనా కొత్త నాయకులా అంటే అదీ కాదు.. అయినా తీరు మాత్రం మామూలే. ప్రచారంలో భాగంగా అధికార వైసీపీ నాయకులు ఇంటింటికి వెళుతూ గోడలు.. గేట్లకు సైతం సిక్టర్లు అతికి స్తున్నారు. వైసీపీ నాయకులు నిబంధనలను తుంగలో తొక్కుతూ ఎన్నికల అధికారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వైసీపీ కార్యకర్తలు తమకు ఎదురులేదన్నట్టు నిబంధనలు పక్కన బెట్టి ఇష్టానుసారం చేస్తున్నారు.ఇప్పటికే వైసీపీ నాయకుల ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై జనసేన, తెలుగుదేశం నాయకులు ఆన్‌లైన్ ఫిర్యాదు చేశారు.


బిక్కవోలు మండలం పందలపర్రులో రిక్షాపై తల్లిని కూర్చోబెట్టి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న నల్లమిల్లి

అనపర్తి సీటుపై పునరాలోచన చేయండి

- టీడీపీని కాపాడుకోవాలన్న సంకల్పంతోనే యాత్ర
- రెండో రోజు పందలపర్రులో నల్లమిల్లి

అనపర్తి, మార్చి 30 : అనపర్తిలో తెలుగుదేశం పార్టీని కాపాడుకోవాలన్న సంకల్పంతోనే న్యాయం కోసం నల్లమిల్లి అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తి అసెంబ్లీ సీటుపై నియోజకవర్గంలో చెలరేగిన మంటలు నేటికీ చల్లారలేదు. సీటు మార్పు చేయడంపై ప్రజాభిప్రాయ సేకరణకు కుటుంబంతో కలిసి గ్రామాల పర్యటన చేపట్టిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రెండో రోజైన శనివారం బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో పర్యటించారు. నాయకులు, కార్యకర్తలు ఆయన కుటుంబంతో గ్రామంలో పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.ఈ మేరకు మీ వెంటే మేమంతా ఉంటామని ప్రజలు నల్లమిల్లి కుటుంబానికి భరోసా ఇచ్చారు. వృద్ధాప్యంలో ఉన్న తన తల్లి సత్యవతిని రిక్షాలో కూర్చోబెట్టి నల్లమిల్లి రిక్షా లాగుతూ ముందుకు సాగారు.దీనిలో భాగంగా నల్లమిల్లి మీడియాతో మాట్లాడుతూ పొత్తుల్లో భాగంగా ఒక్క సీటు కూడా కోల్పోకూడదని.. రాష్ట్రంలో వైసీపీ పోవాలని అనపర్తిలో తెలుగుదేశం నిలవాలన్నదే తన కోరిక అన్నారు. మూడు పార్టీల అధినేతలు మరొకమారు ఆలోచన చేసి గెలుపు దిశగా ఉన్న అనపర్తి నియోజకవర్గాన్ని చేజేతులా పాడుచేయవద్దని కోరారు. నియోజకవర్గంలో అంచెలంచెలుగా టీడీపీని బలోపేతం చేస్తూ గెలుపు దిశగా పయనింపజేసే సమయంలో ఇటువంటి అవాంతరం ఏర్పడడం దురదృష్టకరమన్నారు. అనపర్తిలో టీడీపీని రక్షించేందుకు అధినేత ఆలోచన చేస్తారన్న నమ్మకం తనకుందన్నారు. సీటు మార్చిన నాటి నుంచి నా వెన్నంటి ఉంటున్న కార్యకర్తల మేలు మరచిపోలేనన్నారు.ఆయన వెంట నల్లమిల్లి కుటుంబం, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవర్ కట్





ట్రాన్స్‌కో షాక్

పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

- మొండి బకాయిలపై చర్యలు ప్రారంభించిన ట్రాన్స్‌కో
- సుమారు రూ.350 కోట్ల బకాయిల వసూలుకు రంగంలోకి
- చెల్లింపునకు ఎటువంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం
- పైగా ఆ డబ్బులను సైతం ప్రభుత్వ పథకాలకు మళ్లింపు
- పంచాయతీల ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం
- అడిగి..అడిగి..విసిగిపోయిన ట్రాన్స్‌కో
- ఎట్టకేలకు చర్యలు ప్రారంభం
- అంధకారంలో పంచాయతీ కార్యాలయాలు
- విద్యుత్ సరఫరా లేక మంచినీటి కుళాయిలన్నీ బంద్

రాజమహేంద్రవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అటు ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఇటు పంచాయతీల అలసత్వంతో విసిగిపోయిన ట్రాన్స్‌కో 'పవర్' బెత్తం ఝళిపించింది. ప్రభుత్వ కార్యాలయాల బిల్లుల వసూలు కోసం దండం పట్టుకోక తప్పలేదు. విద్యుత్ షాక్‌తో గతంలో ఎప్పుడూ లేని విధంగా గ్రామాల్లో వీధిలైట్లు ఆరిపోయాయి. నీతులు చెప్పే పాలకుల తీరుతో గ్రామాల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ (విద్యుత్ పంపిణీ సంస్థ) సర్కిల్ పరిధిలోని తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలోని పలు మండలాల్లోని వీధులు అంధకారంలోకి వెళ్లక తప్పలేదు. పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు కోట్లాది రూపాయలు బకాయి పడడంతో విద్యుత్ పంపిణీ సంస్థ మనుగడ, గ్రామాల్లో వీధి లైట్లు నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారుతోందని నాలుగు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన సంగతి గమనార్హం.

పేరుకుపోయిన బకాయిలు

పంచాయతీలు గ్రామాల్లో వీధిలైట్లు, మంచినీటి సరఫరాకు విద్యుత్‌ని వినియోగిస్తాయి. అయితే టీడీపీ ప్రభుత్వంలో ఆ బిల్లులను నేరుగా విద్యుత్ పంపిణీ సంస్థలకు నగదు జమ చేసేవారు. కానీ, వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్ని వ్యవస్థల మాదిరిగా విద్యుత్ పంపిణీ వ్యవస్థ కూడా అతలాకుతలమైంది. పంచాయతీలే ఆ విద్యుత్ బిల్లులను చెల్లించుకోవాలని స్పష్టం చేసింది. దీంతో గ్రామాల్లోని వీధిలైట్లు, మంచినీటి సరఫరా ఇబ్బందుల్లో చిక్కుకున్నాయి. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంటును (అప్పుకాదు.. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు) కూడా దారి మళ్లించి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల పేరుచెప్పి పంచేయడంతో కనీసం కరెంటు బిల్లులు చెల్లించలేని స్థితిలో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. అయితే కరెంటు సరఫరా నిలిపివేస్తే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో విద్యుత్ పంపిణీ సంస్థ ఈ నాలుగేళ్లుగా కష్టాన్ని భరిస్తోంది. ఆ మంచితనం ఖరీదు కోట్లాది రూపాయలకు పేరుకుపోవడంతో బెత్తం తీయక తప్పలేదు.

బకాయిలు సుమారు రూ.350 కోట్లు

జిల్లాలను విభజించినా విద్యుత్ సర్కిల్ మాత్రం ఇంకా విభజన కాలేదు. తూర్పు, కోనసీమ, కాకినాడ జిల్లాలు, ఏజెన్సీలోని కొంత ప్రాంతం రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలో ఉన్నాయి. వీటి సంబంధించి(ఉమ్మడి తూర్పు) 1029 పంచాయతీలు ఉన్నాయి. గత నెల 29 వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో పంచాయతీలు రూ.9,14,48,198.. తూర్పు రూ.149,38,34,662.. కాకినాడ రూ.94,83,51,858.. కోనసీమ రూ.29,46,49,471.. మొత్తం కలిపి 282 కోట్ల 82 లక్షల 84 వేల 189 రూపాయల బిల్లులు పేరుకుపోయాయి. అయితే, ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు తెరవెనుక పనులు తెలియకూడదనే ఉద్దేశంతో కేవలం గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి అంటే 11 నెలల బిల్లులను మాత్రమే వసూలు చేసుకోవాలని విద్యుత్ పంపిణీ సంస్థకు ప్రభుత్వం హుకుం జారీ చేసినా పంచాయతీల్లో నిధుల్లేక ఫలితం లేకపోయింది. ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న పంచాయతీలు కూడా పైసలు విదల్చలేదు. ఇక, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఉమ్మడి తూర్పులో రూ.74 కోట్ల 42 లక్షల రూపాయలు కరెంటు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా ఉన్న పంచాయతీలు సైతం బిల్లులు చెల్లించలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. కాగా.. కరెంటు సరఫరా నిలిపివేయడంపై తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారి రాంబాబును వివరణ కోరగా.. తన దృష్టికి అలాంటి సమస్య రాలేదని కానీ, రెండు రోజుల్లో బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామనడం గమనార్హం.

ఎందుకు ఊరుకున్నారు..

కరెంటు బిల్లు రూ.150 చెల్లించకపోతే రంచనుగా ఫీజు పీకేస్తారు. మరి కోట్లాది రూపాయల బకాయిలు ఉండగా ఎందుకు ఊరుకున్నారనే సందేహం సామాన్యుడి బుర్రను తొలిచేయవచ్చు. దానికి ఏకైక కారణం వైసీపీ పాలకులు అని చెప్పక తప్పదు. గ్రామాలకు విద్యుత్ నిలిచిపోతే పాలకుల చేతగానితనం బయట పడుతుందనే ఉద్దేశంతో కింది స్థాయిలోని ఏఈ నుంచి ఉన్నత స్థాయిలోని సీఎండీ వరకూ బెదిరింపులతో కాలం నెట్టుకొచ్చారు. ఇప్పుడు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో తాము నలిగిపోతున్న విషయంపై ప్రజలకు నిజం తెలియజేయాలని విద్యుత్ పంపిణీ సంస్థ పూనుకొంది. దీంతో గ్రామాల్లో లైట్లు ఆరిపోయాయి. కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం, మలికిపురం, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లోని పంచాయతీల ఫీజు పీకేశారు.

జీతానికి, బిల్లుకు లంకె..

గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం వ్యవహరించడంతో విద్యుత్ పంపిణీ సంస్థ ఇబ్బందుల్లో పడింది. విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి విద్యుత్‌ని కొనుగోలు చేసి ప్రజలకు విద్యుత్ పింపిణీ సంస్థలు సరఫరా చేస్తాయి. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు అడ్వాన్సుగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వ హామీ మేరకు ప్రజలకు విద్యుత్ పంపిణీ సంస్థలు సరఫరా చేస్తాయి. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు పేరుకుపోవడంతో విద్యుత్ పంపిణీ సంస్థ క్రమంగా నష్టాల్లోకి జారుకొంది. గత ప్రభుత్వంలో ఒకటో తారీఖున జీతాలు ఇచ్చేది. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక జీతాలు ఒకటో తారీఖున కాకుండా 20వ తారీఖు వరకూ ఖాతాకు జమవుతున్నాయి. ఈ జాప్యంపై ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే బకాయిలను వసూలు చేసుకొని జీతాలు తీసుకోవాలని మౌఖికంగా హుకుం కూడా జారీ చేయడంతో.. అటు ప్రభుత్వ బకాయిలను గట్టిగా అడగలేక ఇటు బిల్లులు వసూలు కాక మానసికంగా ఉద్యోగులు తీవ్ర ఆవేదన అనుభవిస్తున్నారు.

నో పవర్

ప్రభుత్వ నిర్లక్ష్యానికి దక్కిన ఫలితం

ఆత్రేయపురం, మార్చి 30: గ్రామ పంచాయతీలకు ట్రాన్స్‌కో 'పవర్' షాక్ ఇచ్చింది. శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీలకు ట్రాన్స్‌కో సర్వీసులు తొలగించడంతో గ్రామాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ట్రాన్స్‌కో వైఖరిపై సర్పంచ్‌లు మండిపడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి 30 శాతం నిధులు ఈసీఐఎల్, నెడ్‌క్యాప్, పీడబ్ల్యుఎస్ పేరుతో చార్జీలు వసూళ్ల చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో సర్పంచ్‌లు, కార్యదర్శులు సతమతమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలకు గత ఆగస్టు నెలలో రూ.700కోట్లు, ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.700 కోట్లు 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు జమయ్యాయి. గత ఏడాది కాలం నుంచి పంచాయతీలకు ఎటువంటి ఆదాయం లేకపోవడంతో ఖర్చుపెట్టిన బిల్లులు చెల్లించేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీల నిధుల నుంచి వీధి లైట్ల నిర్వహణ చార్జీల పేరుతో 10 శాతం, గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ, నెడ్‌క్యాప్ బిల్లుల పేరుతో 10 శాతం, గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణకు టైడ్ గ్రాంటు నుంచి 10 శాతం నిధులు బలవంతంగా వసూలు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం ట్రాన్స్‌కో పంచాయతీకి సంబంధించి సర్వీసులను తొలగించడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.1400 కోట్లు జమకాగా, ఆ నిధుల్లో నుంచి సుమారు రూ.350 కోట్లు పంచాయతీల నుంచి ముక్కుపిండి వసూలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. రేపు సోమవారంలోపు బిల్లులు చెల్లించాలని హుకుం జారీచేశారు. పలు పంచాయతీలు బిల్లులు చెల్లించేందుకు సమాయత్తం అవుతుండగా ట్రాన్స్‌కో అధికారులు శనివారం ఆకస్మికంగా కరెంట్ సర్వీసులు తొలగించి సర్పంచ్‌లకు కనీస మర్యాద ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన నావికాదళ విన్యాసాలు





విన్యాసాలను ప్రదర్శిస్తున్న దృశ్యాలు

సర్పవరం జంక్షన్, మార్చి 30 : కాకినాడ సముద్ర తీరంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఎక్స్ టైగర్ ట్రయంఫ్-24 సీ ఫేజ్ విన్యాసాలు శనివారంతో ముగిశాయి. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత్-అమెరికా యాంపిబీఎస్ విన్యాసాల్లో భాగంగా ఇరు దేశాలకు చెందిన సుమారు 1100 మంది త్రివిధ దళాల సైనికులు, అధికారులు ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన సైనిక విన్యాసాలు దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణాన్ని తలపించేలా జరిగాయి. నింగి, నేల, సముద్ర ప్రాదేశిక జలాల్లో మోహరించిన ఇరు దేశాల యుద్ధ నౌకలు ఒకవైపు, శత్రువుల శిబిరాలను గుర్తించి యుద్ధ హెలికాప్టర్ల ద్వారా బాంబుల మోత మరోవైపు, సముద్ర తీరంలో భూమిపై నుంచి అత్యాధునిక సైనిక ఆయుధాలు చేతబట్టిన ఆర్మీ సిబ్బంది మరోవైపు శత్రుసేనలపై విరుచుకుపడి యుద్ధ క్షేత్రాన్ని తలపించేలా త్రివిధ దళాల సైనికులు నిర్వహించిన సైనిక కసరత్తు ఆద్యంతం తీవ్ర ఉత్కంఠకు దారితీశాయి. తుపాన్లు, విపత్తుల సమయంలో సాయం, వైద్యం అందించడం, శత్రు దేశాలు భూ ఆక్రమణకు దిగడం, యుద్ధ సమయంలో సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇరుదేశాల త్రివిధ దళాలు కదనం రంగంలోకి దిగి భూమి, సముద్రం, ఆకాశయానం ద్వారా త్రివిధ దళాలు యుద్ధ నైపుణ్యాలను ప్రదర్శించాయి. ఈ దాడుల్లో యుద్ధ ట్యాంకులు, యుద్ధ నౌకలు, సైనిక హెలికాప్టర్లు, జెట్ విన్యాసాలు, ప్రత్యేక వెసల్స్ మెకనైజ్డ్ లాంగ్ క్రాఫ్టలు, ఐఎన్ఎస్ ఐరావత్, జలస్వ, కేసరి వంటి యుద్ధ నౌకలు పాల్గొని సామర్థ్యాలను ప్రదర్శించాయి. వీటితో పాటు అమెరికాకు చెందిన ల్యాండింగ్ క్రాఫ్ట్ ఎసల్ట్, జర్మన్ యుద్ధ టౌన్ నౌక, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, చేతక్ హెలికాప్టర్లు తదితర యుద్ధ బృందాలు నాలుగు రోజుల పాటు సాగిన విన్యాసాల్లో పాల్గొని తమ సామర్థ్యాలను ప్రదర్శించారు. ఈ విన్యాసాలను నేవీ రియల్ అడ్మిరల్ ఫ్లాగ్ ఆఫీసర్ రాజేష్ ధనకర్, ఆర్మీ మేజర్ జనరల్ అఖిలేష్‌కుమార్, అమెరికా నేవీ రియర్ అడ్మిరల్ వైస్ కమాండర్ జాక్విన్ మార్టినైజ్‌లు పాల్గొని, త్రివిధ దళాలు నిర్వహించిన విన్యాసాలను తిలకించి, పలు సూచనలు చేశారు. అలాగే యుద్ధం, ఆపద సమయంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు అందించే ఫస్ట్ ఎయిడ్, ఆపరేషన్, వైద్య సేవల శిబిరాలను సందర్శించారు. కాకినాడ బీచ్ నుంచి ఉప్పాడకు వెళ్లే వాహనాలను ఆదివారం నుంచి అనుమతించనున్నట్లు తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు.

విధుల నుంచి వలంటీర్లు దూరం

కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం..

సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు స్వాధీనం చేసుకోవాలని ఆదేశం

సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయించే యోచన?

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీకి ఎన్నికల కమిషన్ తేరుకోలేని షాక్ ఇచ్చింది. పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి వలంటీర్లను తప్పించింది. అంతే కాక వారి వద్ద ఉన్న ప్రభుత్వం సెల్‌ఫోన్లను కూడా వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. దీంతో జిల్లాలోని వైసీపీ నేతల్లో కలకలం మొదలైంది. వలంటీర్ల చేత పింఛన్లు పంపిణీ చేయించి.. అదే సమయంలో ఓటు వైసీపీకి వేయవలసిన అవసరం గురించి చెప్పించడానికి వైసీపీ పెద్ద కుట్ర చేసిన సంగతి తెలిసిందే. వలంటీర్ల చేత చెప్పిస్తే కొందరైనా వింటారనే ఆలోచనతో వైసీపీ నేతలు వ్యూహం పన్నారు. మొదట్లో రాజకీయ పార్టీల సమావేశాలకు వెళ్లవద్దని ఆదేశించినా నేతల ఒత్తిళ్ల వల్ల కొందరు వెళ్లి ఆ కాస్త ఉద్యోగం పోగొట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ విధంగా రాజమహేంద్రవరంలో 24 మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి వారితో పనిచేయించుకునే ఆలోచన కూడా వైసీపీ నేతలు కొందరు చేశారు. దీంతో 16 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. అంతేకాక ఎన్నికల ముందు ఏప్రిల్ 1, మే 1వ తేదీల్లో కూడా పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నందున వారికి వలంటీర్ల చేత పింఛన్లు ఇప్పించి, ఓటు వైసీపీకి వేయాలని చెప్పించే ప్రయత్నంలో ఉన్నారు. ఇది పసిగట్టిన ఎన్నికల కమిషనర్ జోక్యం చేసుకుని, పింఛన్ల పంపిణీలో వలంటీర్ల పాత్ర ఉండకూడదని, వారినుంచి ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లు కూడా స్వాధీనం చేసుకోవాలని, ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. వలంటీర్ల ఫోన్లలో తన పరిధిలోని ఓటర్ల పూర్తి వివరాలు ఉంటాయి. వారితో వాట్సాప్ గ్రూపు కూడా ఏర్పాటు చేశారు. ప్రతి సమాచారం వాట్సాప్ ద్వారా అందిస్తున్నారు. ఇక వాట్సాప్, ఫోన్, మెసేజ్ ద్వారా కూడా ఓటర్లను ప్రభావితంగా చేయకుండా ఉండే విధంగా వారి ఫోన్లను స్వాధీనం చేసుకోమని ఆదేశించింది. దీంతో వైసీపీ కంగారు పడుతోంది. జిల్లాలో సుమారు రెండు లక్షల 45 వేలు పింఛన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 9146 మంది వలంటీర్లు వీటిని పంపిణీ చేసేవారు. ఇటీవల వారి సంఖ్య బాగా తగ్గింది. ఇవాళ వీరిని ఆపేయడంతో పాటు వాటన్నింటిని ఒకటి నుంచి పంపిణీ చేయడానికి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులతో ఈ పంపిణీ చేయించే ఆలోచన చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఏ గైడ్‌లైన్స్ వస్తాయోనని ఎదురు చూస్తున్నారు.

మావోయిస్టుల కరపత్రాలు



ఎటపాక, మార్చి 30: రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో రెండు చోట్ల శనివారం వెలసిన (భారత కమ్యూనిస్టు పార్టీ) మావోయిస్టు కరపత్రాలు కలకలం రేపాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండు రాష్ట్రాల సరిహద్దులో కరపత్రాలు దర్శనం ఇవ్వడంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఎటపాక మండలం, సరిహద్దు గ్రామాలైన కన్నాయిగూడెం గ్రామ శివారు ప్రాంతంతో పాటు చెన్నంపేట- సీతంపేట గ్రామాల మధ్యలో అల్లూరి డివిజన్ కమిటీ, చర్ల-శబరి ఏరియా కమిటీ పేరుతో మావోల పోస్టర్లు వెలిశాయి. పోస్టర్లను చెట్లకు, నేలపై వదిలివెళ్లారు. పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీని, దాంతో అంటకాగుతున్న పార్టీలన్నింటినీ తన్ని తరమాలని పేర్కొన్నారు. బ్రాహ్మణీయ, హిందుత్వ ఫాసిస్టు ప్రమాదం నుంచి దేశాన్ని, ప్రజలను కాపాడమంటూ పేర్కొన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలపై జరుగుతున్న ఘోరాలు దేశంలో అన్ని ప్రాంతాల్లో జరుగుతాయని, మతోన్మాద శక్తులనే ఓడించాలన్నారు. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో మావోల పోస్టర్లు దర్శనం ఇవ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే పోస్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

నిపుణులైన సర్జన్లుగా ఎదగాలి

రాజానగరం, మార్చి 30: జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలలో ఉన్నత ప్రమాణాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలను వినియోగించుకుని మంచి దంత వైద్య సర్జన్లుగా ఎదగాలని న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్) దంత వైద్య పరిశోధన విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్థోడాంటిస్ట్ డాక్టర్ రీతూ దుగ్గల్ అన్నారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాల దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ముగింపు సభలో ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాలలో విద్యనభ్యసించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా దంత వైద్య విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాల మెంటార్ డాక్టర్ గన్ని సందీప్ మాట్లాడుతూ పెద్ద పట్టణాలు, నగరాలకు మాత్రమే పరిమితమైన దంతవైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ ప్రాంతంలో స్థాపించామన్నారు. అనంతరం దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ గంటా సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆదాయం రూ.12 లక్షలు

ఐ.పోలవరం, మార్చి 30: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం శనివారం దేవదాయశాఖ సహాయ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. 70 రోజులకు ప్రధాన హుండీ ఆదాయం రూ.5,57,638లు, నిత్యకల్యాణ కట్న కానుకల హుండీ ఆదాయం రూ.4,95,233, అన్నదానం హుండీ ఆదాయం రూ.1,58,085 వెరసి మొత్తం ఆదాయం రూ.12,10,956 వచ్చింది. దీంతో పాటు ఒక విదేశీ డాలర్, ఒక టైటానిక్ వాచ్ వచ్చినట్టు తెలిపారు. ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, మట్టపర్తి శివరాంబాబు, ఆలయ అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, మార్చి 30: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టికెట్ల విక్రయం ద్వారా రూ. 2,26,700 అన్నదాన విరాళాలు ద్వారా రూ. 41,444 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 8,240, తులాభారం రూ.400 వెరసి రూ.3,38,655 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 12 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

బాలబాలాజీకి రూ.2.13 లక్షల ఆదాయం

మామిడికుదురు, మార్చి 30: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారికి శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,13,043 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ జీమాధవి తెలిపారు. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వైనతేయ నదిలో భక్తులు స్నానమాచరించి స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. స్వామివారిని 3,174 మంది దర్శించుకుని 2,358 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. నిత్యాన్నదాన పథకానికి ఆచంట మండలం కొడమంచిలికి చెందిన తాళ్లూరి రామచంద్రరావు-సూర్యచంద్రావతి దంపతులు రూ.10 వేలు విరాళంగా అందించారు

సీఎంఆర్ జ్యువెలరీ మాల్ ప్రారంభం



షోరూం ప్రారంభించిన అమృతతో మావూరి కుటుంబం

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 30: కాకినాడలో సీఎంఆర్ జ్యువెలరీ మాల్‌ను శనివారం సాయంత్రం హనుమాన్ చిత్రం హీరోయిన్ అమృత అయ్యర్ ప్రారంభించారు. స్థానిక దేవాలయంవీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ మాల్‌ను ప్రారంభించి, నగలను ధరించి కనువిందు చేశారు. ఆమెను చూసేందుకు అభిమానులు తరలివచ్చారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడ రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. సీఎంఆర్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా ఆభరణాలు రూపొందిస్తున్నామని అన్నారు. బంగారు ఆభరణాలపై తరుగు 3 శాతం, వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదన్నారు. సంస్థ ఎండీ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ ప్రస్తుత తరానికి తగ్గట్టుగా సరికొత్త డిజైన్‌లతో ఆభరణాలు తయారు చేయిస్తున్నామన్నారు. మాల్ ప్రారంభం సందర్భంగా గ్రాముకు రూ.250 తగ్గింపు ఇస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ సీఈవో వైఎల్ చౌదరి, ద్వారంపూడి వీరభద్రారెడ్డి, రాపాక వెంకట్ ఆనంద్, పి.మంగరాజు, బాదం సుందరరావు, పెద్ది రత్నాజీ, గొడవర్తి లక్ష్మీలావణ్య పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట



తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం, మార్చి30: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని ప్రాకార మండపంలో క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.49.84 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

శనీశ్వర ఆలయంలో పూజలు

కొత్తపేట, మార్చి 30: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి శనీశ్వర(మందేశ్వర) ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సర్వదర్శనాలకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,15,059 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

'రివర్‌బే'లో విజిలెన్స్ తనిఖీలు

అన్నీ ఉల్లంఘనలే.. కేసులు నమోదు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లలో వంట గదులు పరిశుభ్రంగా ఉండాల్సిందేనని.. వినియోగదారులకు నాణ్యమైన, తాజాగా, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించకపోతే చట్టపరంగా చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. నగరంలోని రివర్‌బే హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలిసి ఎస్పీ సోదాలు చేశారు. పలు ఉల్లంఘనలను గుర్తించి కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్పీ వివరాల ప్రకారం.. హోటల్‌లో వాడుతున్న నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్(టీపీసీ) మీటర్ రీడింగ్ చూడగా 25% కంటే ఎక్కువగా ఉండడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేశారన్నారు. అలాగే మునిసిపాలిటీకి ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించడం లేదన్నారు. ఆ బకాయిలు రూ.13,77,220 ఉండడం గుర్తించామన్నారు. తూనికల యంత్రానికి నిబంధనల ప్రకారం అనుమతుల లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారన్నారు. వ్యాపారానికి సంబంధించి జీఎస్టీ రిటర్నులు గత ఏడాది సెప్టెంబరు నుంచీ ఫైల్ చేయలేదన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాల నాయుడు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

గౌరీదేవిపేట పీహెచ్‌సీని తనిఖీ చేసిన పీవో

ఎటపాక, మార్చి30 ఎటపాక మండలంలోని గౌరీదేవిపేట పీహె చ్‌సీని శనివారం ఐటీడీఏ పీవో కా వూరి చైతన్య తనిఖీ చేశారు. ఆక స్మిక పర్యటనలో భాగంగా పీవో పీహెచ్‌సీ సందర్శించారు. పీహె చ్‌సీలోని రికార్డులను పరిశీ లించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలతో పాటు ఓపీపై ఆరా తీశారు. అయితే పీహెచ్‌సీలో నీటి కొరత ఉందని, సమస్య తీర్చాలంటూ సిబ్బంది, వైద్యాధికారిని పీవో దృష్టికి తెచ్చారు. స్పందించిన పీవో సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

ఎటపాక, మార్చి 30: పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామ సత్యనారాయణ ఓ ప్రకటన లో తెలిపారు. 2024, ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు. ఆన్‌లైన్‌లో polycetap.nic.in దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ సమయంలో మెటీరియల్ కూడా అందజేయనున్నట్లు తెలిపారు. అభ్య ర్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

రంపచోడవరం, మార్చి 30: ముసురుమిల్లి ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠ శాలలో సీఆర్‌టీగా పనిచేస్తున్న వై.రామకృష్ణను ఆది వాసీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బోండ్ల వరప్రసాదరావు ఆధ్వర్యంలో శనివారం సన్మానిం చారు. ఇటీవల 280 మంది సీఆర్‌టీలను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, అందులో భాగంగా వై.రామకృష్ణను కూడా రెగ్యు లర్ చేస్తూ ఉత్తర్వులు రావడంతో పాఠశాల ఉపాధ్యాయులు హర్షం తెలిపా రు. ఈ సందర్భంగా సీఆర్‌టీలను రెగ్యులర్ చేయడంపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, గిరిజన సంక్షేమ ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

4న మండల పరిషత్ సాధారణ సమావేశం

రాజానగరం, మార్చి30: రాజానగరం మండల పరిషత్ సాధా రణ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 4న ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీఏకెఎస్ జ్యోతిర్మయి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నిక ల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున విధానపరమైన నిర్ణయాలు, తీర్మానాలు లేకుండా సాధారణ సమీక్షలపై చర్చిస్తామన్నారు. మండలంలోని ప్రజాప్రతి నిధులు, మండల స్థాయి అధికారులంతా విధిగా ఈ సమావేశానికి హాజరుకా వాలని కోరారు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యం

● రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరంరూరల్ మార్చి 30: రాష్ట్రంలో అరాచక పాలన సాగి స్తున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆవిర్భవించిందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొ న్నారు. రూరల్ మండలం కాతేరు, బొమ్మూరులో జనసేన పార్టీ రూరల్ మం డల అధ్యక్షుడు చిన్నారావు అధ్యక్షతన జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి గంగిన హనుమంతరావు పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే గోరంట్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ జగన్ మరోసారి అధికారంలోకి రావడానికి ఇప్పటికే వారి బ్యాచ్‌లను సూట్‌కేసులతో దింపారన్నారు. మద్యం ఇసుక గంజాయి మాఫియా ముఠాలను పెంచి పోషి స్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, వెలుగుబంటి ప్రసాద్, రాకుర్తి రామచంద్ర, పిన్నమరెడ్డి సత్యన్నారా యణ, బిక్కిన సాంబశివరావు, నున్న కృష్ణ, గంగిన నాని, మన్యం పెదబాబు, గురజాడ రాజేశ్వరి, జి.సురేష్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

18వ డివిజన్‌లో ఎమ్మెల్యే గోరంట్ల కుమార్తె ప్రచారం

రూరల్ నియోజవర్గం పరిధిలోని రాజమహేంద్రవరం 18వ డివిజన్‌లో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పెద్దకుమార్తె కంఠంనేని శిరీష ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. శనివారం తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారంలో శిరీష పాల్గొని ప్రజలను కలిశా రు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు



సమావేశంలో మాట్లాడుతున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి

ఎంపీ భరత్‌వి అనాలోచిత నిర్ణయాలు

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 30: ఎంపీ మార్గాని భరత్ రామ్ అనాలో చిన నిర్ణయాలతో రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులోని వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక డీలక్స్‌సెంటర్ నుంచి ఫ్రూట్స్ మార్కెట్ రోడ్డు వరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి శనివారం ప్రచారం చేశారు. వ్యాపారులను కలిశారు. ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలి పించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాధనం దుర్వి నియోగంచేసే విధంగా ఎంపీ భరత్‌రామ్ పనులు చేపడుతున్నారని ఆరోపిం చారు. మెయిన్‌రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ స్తంభాలే అందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకిరామయ్య, తవ్వా రాజా, మజ్జి రాంబాబు, నల్లం శ్రీను, రామినీడి మస్తాన్‌చౌదరి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్, బూరా రామచంద్రరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మెయిన్ రోడ్డులో వ్యాపారులకు అభివాదం చేస్తున్న అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

సీఏఏ చట్టం రాజ్యాంగ వ్యతిరేకం

● రౌండు టేబుల్ సమావేశంలో వక్తలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 30: నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చ ట్టం(సీఏఏ) అమలు కోసం రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కిందని, ఇది రాజ్యాంగ వ్యతిరేక చట్టమని పలువురు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. శనివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయం లో పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, లౌకిక భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామనే అంశంపై రౌం డుటేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ 2019లో కేంద్ర ప్రభుత్వం సీఏఏను తీసుకొ చ్చిందని, అయితే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధిపొంద డం కోసం ఇప్పుడు అమలు చేస్తోందన్నారు. ఈ చట్టం రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందన్నారు. సమావేశానికి అ ధ్యక్షత వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మా ట్లాడుతూ దేశాన్ని ముక్కలు చేసే ప్రమాదమున్న సీఏఏను సమర్థించుకోవడానికి ప్రభుత్వం అనేక కుంటి సాకులు చెబుతోందని విమర్శించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరరా వు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తదితరులు మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కూండ్రపు రాంబాబు, యునైటెడ్ డెమోక్రటిక్ ఫోరం కన్వీనర్ జహం గీర్, ఐడీఎల్ యూత్ మూమెంట్ నాయకులు కరీముల్లా ఖాన్, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, సీఐటీయూ రా జులోవ, ఎస్‌ఎస్ మూర్తి, చింతలపూడి సునీల్, కె.జ్యోతిరా జు, బి.రాంబాబు, ఎస్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణకు బ్యాచ్ ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 30: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణా పాఠశాలలో శనివారం 11వ బ్యాచ్ ప్రారంభమైందని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఎస్ కే షబ్నం తెలిపారు. శిక్షణ కోసం మొత్తం 18 మంది లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కల్గి హెవీ డ్రైవింగ్ శిక్షణ కోసం, డ్రైవింగ్ స్కిల్స్, నైపుణ్యత డ్రైవింగ్ గురించి నేర్చుకునేందు కు శిక్షణా పాఠశాలలో చేరారని తెలిపారు. ఈ సందర్భం గా శిక్షణకు సంబంధించిన మెటీరియల్‌ను శిక్షణార్థులకు అందజేశామన్నారు. ఇప్పటివరకూ 10 బ్యాచ్‌ల్లో 170 మం ది డ్రైవర్లు హెవీ డ్రైవింగ్ లైసెన్సు పొందారని తెలిపారు. మొదటిరోజు ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి, డ్రైవింగ్‌కు అవసర మైన ప్రాథమిక సూచనలు గురించి క్లాసు తీసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) ఎం.అజయ్ బాబు, సూపరింటెండెంట్ (మెకానికల్) పీబీఎస్ రాజు, సి బ్బంది పాల్గొన్నారు.

నేడు తిరుమలలో జేఈఈపై (మెయిన్స్) అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం, మార్చి 30: పదో తరగతి పూ ర్తిచేసిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు జేఈఈ (మెయి న్స్), జేఈఈ(అడ్వాన్స్‌డ్) అండ్ నీట్ వంటి పరీక్షలపై ఆదివారం ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరంలోని కాతేరులోగల తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో అవగా హన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సదస్సుకు హాజరయ్యే విద్యా ర్థులు వెబ్‌సైట్ www.tirumalaedu.comలో తప్ప నిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 10వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివిధ జాతీయస్థాయి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నామని, నిపుణులైన అధ్యాపకులతో సలహాలు, సూచనలు తెలియ జేస్తారన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7997071672లో సంప్ర దించాలన్నారు.

రేపటి నుంచి ధాన్యం కొలుగోలు పారంభం

రంగంపేట, మార్చి 30: మండలంలో ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం ఒకటో తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు మండల వ్యవ సాయ శాఖాధికారి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో రబీ 2023-24కి సంబంధించి 810 హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంట సాగుచేశామన్నారు. వరి కోతలు జరుగుతున్న తరు ణంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. కామన్ రకం (ముత కలు) 75కిలోలు 1637 రూపాయలు, 100 కిలోలు 2183 రూపాయలు మద్దత్తు ధర ఉందని కావున మండలంలోని రైతులందరూ రైతు భరోసా కేంద్రాల్లో షెడ్యూలింగ్ ద్వారా మద్దతు ధర పొందాలని రైతులకు వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు సూచించారు.

'విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి'

బిక్కవోలు, మార్చి 30: విద్యార్థుల్లో దాగి వున్న నైపు ణ్యాలను వెలికి తీసేందుకే ప్రేరణ కార్యక్రమాలను ప్రభు త్వం చేపట్టిందని కాపవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు. శనివారం పాఠశాలలో 9, 10 తర గతులు విద్యార్థులకు ప్రేరణలో భాగంగా వివిధ అంశా లపై పోటీలు జరిపారు. దీంట్లో భాగంగా విద్యార్థులు డ్రాయింగ్ టీచర్ రవి ఆధ్వర్యంలో వివిధ చిత్రాలను గీశారు. అయోధ్య రామమందిర నమూనాను కూడా తయారుచేసి అందరి మన్ననలు పొందారు.

'శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి'

దివాన్‌చెరువు, మార్చి 30: మహిళలు తామునేర్చుకు న్న మగ్గంవ ర్క్, కుట్టుశిక్షణలను సద్వినియోగం చేసుకుని ప్రయోజనం పొందాలనివినయ్‌సుంకర ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తతుంగ పాడులో మగ్గంవర్క్ శిక్షణ ముగించుకున్న 50 మంది మహిళలకు ధ్రువపత్రాలను స్థానిక ఫౌండేషన్ కార్యాల యంవద్ద శనివారం అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ లు సుంకరనాగేశ్వరరావు, వీరాస్వామి, వినీల పాల్గొన్నారు.

ముకుందవరంలో ఆరోగ్య సురక్ష

రంగంపేట, మార్చి 30: మండలంలోని ముకుంద వరంలో వెల్నెస్ సెంటర్‌లో శనివారం రంగంపేట ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో 286 మందికి వైద్య సేవలు అందించారు. అవసర మైన వారికి కంటి పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీ రిలో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కె.జయమణి, ఎంపీహెచ్‌ఈవో వి.ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ మణికంఠ, గంగాభవాని, చంటిబాబు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

స్వామీ స్మరణానందజీ మహరాజ్‌కు ఘన నివాళి

అనపర్తి, మార్చి 30 : రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్‌ల 16వ సర్వాధ్యక్షుడు స్వామీ స్మరణానందజీమహ రాజ్ జీవితం ఆదర్శం కావాలని ఆయన పమరపదించినా ఆయన సూక్తులు భక్తుల మన స్సుల్లో నిలిచిపోతాయని అనపర్తి రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలోని కోళ్ల రైతుల కళ్యాణ మండపంలో జరిగిన స్వామీజీ సంతాప సభలో సేవా సమితి ప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు రామకృష్ణమిషన్ సభ్యుడు దుర్గాప్రసాద్, సత్తి వెంకటరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, తాడి చంద్రశే ఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం



మధురపూడి విమానాశ్రయంలో పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

కోరుకొండ, మార్చి 30: పిఠాపురం వారాహి యాత్ర లో పాల్గొనేందుకు శనివారం మధురపూడి విమానాశ్రయా నికి చేరుకున్న జనసేన అధి నేత పవన్‌కల్యాణ్‌కు జనసే న, టీడీపీ, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. వారాహియాత్రకు ముందు నిర్వహించే పూజా కార్యక్ర మంలో పాల్గొనడా నికి పవన్‌కల్యాణ్ రాజానగరం నియోజకవర్గంలోని మధురుపూడి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఆయన పిఠా పురం రోడ్డు మార్గాన బయల్దేరి వెళ్లారు. స్వాగతం పలికిన వారు టీడీపీ నాయకుడు మింగి లక్ష్మినారాయణ, జనసేన నాయకుడు అడ్డాల దొరబాబు, పలువురు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఉన్నారు.

టీడీపీలో చేరిన మద్దాల రమణ

కోరుకొండ, మార్చి 30: మండలంలోని శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన ప్రముఖ వైసీపీ నాయకుడు ఆ గ్రామ సర్పంచ్ భర్త మద్దాల రమణ ఇటీ వల వైసీపీకి రాజీనామా చేశారు. శనివారం ఆయన టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి, తనకాల నాగేశ్వరరావు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో 300 మంది తన అనుచరులతో టీడీపీలో చేరారు. ఈమేరకు టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అక్షర దీక్ష ఆచార్యులు వర్ధంతి సభ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 30: రాజమహేంద్రవరం-కోరుకొండ రోడ్డులోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం అక్షరదీక్ష ఆచార్యులుగా పేరొందిన ఎంఏవీఎల్‌ఎన్ ఆచార్యులు వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన చిత్రపటానికి కుటుంబ సభ్యులు, నాయకులు నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మాజీ ఎంపీ మిడియం బాబూ రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సమాజంలోని ప్రజలంతా అక్ష రాస్యులైనప్పుడే ఆచార్యులు ఆశయాలను సాధించిన వారమవుతామని పే ర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు, డాక్టర్ చైత న్యశేఖర్, బాలోత్సవ నిర్వాహకులు పి.తులసి, ఎన్.రవిబాబు మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్, ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరి గిన ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు తాతారావు, నిశ్చల్, ఎం.విజయ గౌరి, రూపస్‌రావు, శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

ఎండాకాలంలో మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎండాకాలం వల్ల ఇప్పటికే ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, అన్ని శాఖలు సమన్వయం చేసుకుని జా గ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా మంచినీటి సరఫరాకు అవసరమైన చర్య లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఆమె వివిధశాఖల అధికారులతో సమీక్షించారు. విప త్తుల నిర్వహణ సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఎండాకాలంలో ప్రజలు చేయాల్సినవి, చేయకూడని పనులపై అవగాహన కల్పించాలన్నారు. నోడల్ అధికారిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి అందరినీ సమన్వయం పరచు కోవాలని చెప్పారు. ఇప్పటికే వాతావరణంలో మార్పులు వచ్చాయని, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధానకూడళ్లలో హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని, ఓఆర్‌ఎస్ ప్యాకె ట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. 108, 104 అత్యవసర సేవలు, మం దులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. పురపాలక, పంచా య తీశాఖల ఆధ్వర్యంలో విస్తృతంగా చలి వేంద్రాలు ఏర్పాటుచేయాల న్నారు. స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఆర్ డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, పురపాలక సంఘాల ఆధ్వర్యంలో మంచినీటి సమస్య లేకుండా సరఫరా ఏర్పాటు కోసం ముందస్తు ప్రణాళిక అవసరమన్నారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులు, పక్షులకు నీటి లభ్యత ఉండేలా ప్రజల్లో కరపత్రాలు, గోడప్రతుల ద్వారా చైతన్యం కలిగించాలని కలెక్టర్ చెప్పారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో మంచినీరు అందుబాటు ఉంచాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను గుర్తించి తగిన రక్షణ అవసర చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

జేగురుపాడు పేపరుమిల్లులో అగ్నిప్రమాదం

కడియం, మార్చి 30: జేగురుపాడు మెహర్‌గాయత్రీదేవి క్రాఫ్ట్ పేపర్స్ ఎల్‌ఎల్‌పీ పేపరుమిల్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించినట్లు పేప రుమిల్ జనరల్ మేనేజర్ కంఠంశెట్టి మల్లిఖార్జునరావు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని దక్షిణ మండల డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, ఎస్‌ఐ టి.కృష్ణ సాయిలు పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి కారణాలను పోలీసులు విచారి స్తున్నారు.

రాజమహేంద్రి ప్రజల ఆరోగ్యాలు రూ.5 కోట్లకు తాకట్టు

● రాష్ట్రీయ ప్రజాకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 30: రాజమహేంద్రవరం ప్రజల ఆరోగ్యాలను రూ.5 కోట్లకు తాకట్టు పెట్టిన ప్రధాన రాజకీయ పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని రాష్ట్రీయ ప్రజాకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరి గిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి జలాలను పేపరుమిల్లు వ్యర్థాలు కలుషితం చేస్తున్నాయని, వాటిని తాగుతున్న ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పేపరుమిల్లు కాలుష్యంపై పోరాడాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీలు మిల్లు యాజమా న్యంతో కుమ్మక్కై ప్యాకేజీ తీసుకున్నారని ఆరోపించారు. రాజమహేంద్రవరాన్ని తామే తీర్చిదిద్దా మని ఎంపీ భరత్ కొన్ని చారిత్రక ప్రదేశాలను చూపించి, అది తమ ఘనతేనని, తమ వారసత్వ మేనని అనడం చరిత్రను వక్రీకరించడమేనన్నారు. సమావేశంలో ఆర్‌పీసీ నాయకులు కాసా రాజు, సిమ్మా దుర్గారావు, కొత్తపల్లి భాస్కరామం, ఆర్కే చెట్టి, వర్ధనపు శరత్‌కుమార్, ఎండీ హుస్సేన్, కారుమూరి యుగంధర్, ఆకుల మణికంఠ, దుడ్డే త్రినాద్, గుడ్ల సాయి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో బ్లూక్రాఫ్ట్ కార్మికుల దీక్ష విరమణ

బిక్కవోలు, మార్చి 30: బలభద్రపురం శివారు కానేడులో వున్న బ్రూక్రాఫ్ట్ ఆగ్రో ఫ్యాక్టరీలో అన్యాయంగా యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి కార్మికులకు 124 రోజులుగా జీతాలు చెల్లించకపో వడంతో 44 రోజుల క్రితం బిక్కవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేప ట్టారు. అయితే శనివారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వారితో ఎన్నికల కోడ్ కారణంగా సమస్యను పరిష్కరించలేమని అందువల్ల దీక్షను విరమించా లంటూ వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేసారు. కార్మికుల సమస్య పరిష్కారం అయ్యే వరకూ తాను అండగా వుండి న్యాయం చేస్తానని ప్రకటించారు. కార్మిక నేతలు ఏ.నాగేశ్వ రరావు, వి. రాంబా బు, కె.వెంకటరమణ, ఎం.రవి, తదితరులు పాల్గొన్నారు.

రన్‌ఫర్ జీసెస్ ర్యాలీ

వై.రామవరం,మార్చి30: మండల కేంద్రమైన వై.రామవరంలో శనివారం క్రైస్తవ సోదరులు రన్ ఫర్ జీసెస్ ర్యాలీ నిర్వహించా రు. రండి, పరుగెత్తండి, ఏసునందు ఆనందించండి అంటూ నినాదాలు చేస్తూ పలు వీధుల గుండా ర్యాలీ జరిపారు. అనంతరం బస్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి క్రీస్తు బోధనలను పాస్టర్లు వివరించారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆది) సా.6.24
సహరి(సోమ) ఉ.4.36

ఎండా కాలమ్
	గరిష్టం	కనిష్టం
రాజమండ్రి	40.0	23.0



నీరాజనం : ప్రజలకు అభివాదం చేస్తున్న పవన్

పిఠాపురాన తొలి రోజు ప్రచార సభకు హాజరైన జనప్రవాహం

అన్నా.. నీ కోసమే..

నేను మీ వాడిని : పవన్ అభివాదం

జన..పవన్..

ఆశీర్వదించండి..పిఠాపురాన లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించండి

- నియోజకవర్గాన్ని తీర్చిదిద్దే బాధ్యత నాది
- రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా చేస్తా
- ఇక్కడే స్థలం కొంటా.. ఇల్లు కట్టుకుంటా
- నన్ను ఓడించేందుకు వైసీపీకి ఎందుకంత కక్ష
- ఓట్లకు వచ్చే వైసీపీ నేతలను నిలదీయండి
- తొలిరోజు ప్రచార సభలో నిప్పులు చెరిగిన పవన్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి), పిఠాపురం, గొల్లప్రోలు రూరల్, మార్చి 30 : 'పిఠాపురం నియోజకవర్గానికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. దేశం గర్వించదగ్గ ఆలయాలు ఇక్కడే ఉన్నాయి. ఒక పక్క పోర్టులు, సెజ్, సముద్రం, హైవే ఇన్ని ఉన్నా నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. అందుకే పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. ప్రతి మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు తీసుకువస్తా. నాకు ఎందరో వైద్యులైన స్నేహితులు ఉన్నారు. వారితో ఇక్కడ ఆస్పత్రులు నెలకొల్పేలా చేస్తా. కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు తీసుకువచ్చేలా చేస్తా. ఒకసారి ఈప్రాంతం నాది అనుకున్నానంటే దాని అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తా. పిఠాపురంలో ఉన్న ఆలయాలను అన్నింటినీ కలిపి టెంపుల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తా. అందుకే నేను ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని తెలిసి వైసీపీ నన్ను ఓడించడానికి ఎన్ని కుట్రలు పన్నాలో అన్నీ పన్నుతోంది. నాపై ఎందుకు ఇంత కక్ష. మీరంతా అండగా ఉన్నారనే నాపై ఇన్ని వ్యూహాలు అమలు చేస్తోంది. అందుకే చేతులు జోడించి అభ్యర్థిస్తున్నా. పిఠాపురం నుంచి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపండి. లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించండి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి పవన్ పిఠాపురం నియోజకవర్గంలో శనివారం నుంచి పర్యటన ప్రారంభించారు. నాకు ఇష్టమైన దత్తాత్రేయుడి సాక్షిగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాను. ఎలా చేస్తాను అనే సందేహం మీలో చాలా మందికి ఉండొచ్చు. అనుభవజ్ఞుడైన టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ సహకారం, ఇతర నేతలతో నియోజకవర్గాన్ని ముందుకు నడిపిస్తా. ఇక్కడున్న ఆలయాలను కేంద్రంతో మాట్లాడి ప్రత్యేక పథకం కింద నిధులు తెస్తాను. ఉప్పాడ కోత నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాను. కానీ వైసీపీ వాళ్లు ఇవేవీ చేయలేదు. నేను పోటీ చేస్తున్నాను అనగానే నేతలందరూ ఊరురా తిరుగుతున్నారు. ఎందుకు ఇన్నాళ్లు ఈ ప్రాంతాన్ని వాళ్లు అభివృద్ధి చేయలేదు. వంగా గీత వస్తే ఇదే నిలదీయండి. సెజ్‌లో పరిశ్రమలు ఎందుకు లేవని అడగండి. అరబిందో చేపడుతున్న పైపలైన్ కాలుష్యం గురించి నిలదీయండి. జెట్టీలు ఎందుకు లేవో అడగండి. వైసీపీది అంతా బెదిరింపుల రాజ్యం. కాకినాడలో రెండు పోర్టులను అరబిందో ద్వారా అధికార పెద్దలు లాగేసుకున్నారు. కాకినాడ పోర్టులో కంటైనర్లలో డబ్బులను వైసీపీ నేతలు దాచారు. జిల్లాలో ఉన్న మాఫియా డాన్ చెరువుల్లో మట్టి, బొండు ఇసుక, పోర్టు భూములు ఇలా అన్నింటిని మింగేశాడు. అతడి పేరు పలకడం కూడా నాకు ఇష్టం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి సంగతి చూద్దాం. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇక్కడ అన్నివర్గాల సమస్యలు తీరుస్తా. చేనేత, మత్స్యకారుల సమస్యల దగ్గర నుంచి యువతకు స్కిల్ సెంటర్లు, మిర్చి రైతుల కష్టాలు, సంతకు మౌలిక వసతులు ఇలా అన్ని సమస్యలు పరిష్కరిస్తాను. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అమాయకులైన ప్రజల భావోద్వేగాలతో ఇంతవరకు నేతలు ఆడుకున్నారు. కానీ నేను అలా కాదు. బాధ్యతతో వ్యవహరించి ఇక్కడి ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటాను. అందుకే నన్ను ఆశీర్వదించండి. అసెంబ్లీకి పంపం డి.'అని పవన్ కోరారు.పవన్ ఉదయంనుంచి జ్వ రంతో బాధపడు తున్నారు. ఆయ న ఆదివారం పురూహూతికా అమ్మవారిని దర్శించుకుని వారాహికి పూజలు చేస్తారు. పర్యటనలో కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వర్మ, బీజేపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా కృష్ణరాజు ఉమ్మడి శ్రేణులు పాల్గొన్నారు.







పవన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉదయ్ శ్రీనివాస్, పంతం నానాజీ, కొత్తపల్లి సుబ్బారాయుడు



అడుగడుగునా నీరాజనం.. పోలీసుల వైఫల్యం

తొలిరోజు పవన్‌కు అడుగడుగునా నీరాజనం పలికారు.సరిగ్గా మధ్యాహ్నం 12.40 గంటలకు గొల్లప్రోలులో హెలీప్యాడ్ వద్ద దిగారు. అక్కడ టీడీపీ, జనసేన నేతలు పవన్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పురూహూతికా అమ్మవారి దర్శనానికి వెళ్లాల్సి ఉండగా సమయాభావంవల్ల ఆలయం మూతపడింది. దీంతో దొంతమూరులో మాజీ ఎమ్మెల్యే వర్మ ఇంటికి వెళ్లి సుమారు గంట సేపు గడిపారు. అనంతరం పవన్ నేరుగా హోటల్‌లో బస ప్రాంతానికి చేరుకున్నారు. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు జగ్గంపేట నుంచి వచ్చిన ఉద్యమనేత తుమ్మలపల్లి రమేష్ పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. అనంతరం పురూహూతికా అమ్మవారి ఆలయానికి వెళ్లి అక్కడే వారాహికి పూజలు చేద్దామని పవన్ భావించారు. తీరా వారాహికి ఎన్నికల ప్రచార రథం కింద అనుమతులు లేవని అధికారులు అభ్యంతరం చెప్పడంతో దర్శనం కూడా రద్దు చేసుకున్నారు. అక్కడి నుంచి చేబ్రోలుకు బయలుదేరారు. దారిపొడవునా వందలాది జనం పవన్ వెంట నడిచారు. హారతులు పట్టారు. రాత్రి 8 గంటలకు చేబ్రోలుకు చేరుకునేసరికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ వారాహికి అనుమతులు జారీ చేసింది. దీంతో అప్పటికప్పుడు వారాహి ఎక్కి ప్రజలకు అభివాదం చేసుకుంటూ 8.30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు.అప్పటికే వేలాది మంది పవన్ రాక కోసం చూడడం, అదే సమయంలో వారాహి ముందుకు కదలడంతో ఒక్కసారి అనుకోకుండా తొక్కిసలాట చోటుచేసుకుని పలువురికి గాయాలయ్యాయి. ఆ తర్వాత పవన్ వారాహిపైకి ఎక్కి దాదాపు గంట సమయం ప్రసంగించడంతో అభిమానులు ఆనందంతో మునిగిపోయారు. పవన్‌కల్యాణ్ సభ సమయంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ఉదయం 150 మంది పోలీసులతో భద్రత ఉంటుందని తెలియజేసినా రాత్రికి 20మంది కూడా లేకపోవడం గమనార్హం.దీనివల్లే తొక్కిసలాట జరిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మీ భవిష్యత్‌కు నేనున్నా : వర్మ కుటుంబీకులతో జనసేన అధినేత పవన్

వర్మకు అండగా ఉంటా..

పిఠాపురంలో పవన్‌కల్యాణ్

పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 30: పొత్తులో భాగంగా తన కోసం సీటు త్యాగం చేసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మను భవిష్యత్తులో బలమైన స్థానంలో నిలుపుతామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన అనంతరం నియోజకవర్గానికి శనివారం తొలిసారి పవన్ వచ్చారు. హెలికాప్టర్ దిగి నేరుగా పిఠాపురం మండలం పి.దొంతమూరులోని వర్మ నివాసానికి చేరుకున్నారు. తప్పెటగుళ్లు బాణ సంచా కాల్పులు, డప్పుల వాయిద్యాలతో పవన్‌కు స్వాగతం పలికారు.వర్మను ఆలింగనం చేసుకుని సత్కరించారు. వర్మ సతీమణి లక్ష్మీదేవి పవన్‌కు హారతులు ఇచ్చారు. అనంతరం కుమారుడు గిరీష్, ఇతర కుటుంబీకులతో మాట్లాడారు. వర్మ తల్లి అలివేలు మంగ పద్మావతి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వర్మ, జోన్-2 ఇన్‌చార్జి, మాజీ మంత్రి సుజయ కృష్ణరంగారావుతో అరగంటకు పైగా సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులు, పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై చర్చించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం సాధించబోతున్నదన్నారు. దానికి సంకేతమే పిఠాపురం నియోజకవర్గంలో లభిస్తున్న అపూర్వ స్పందన అన్నారు. తన విజయం కోసం నేనున్నానంటూ నిలబడిన వర్మకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్మకు అన్ని విధాలా అండగా ఉంటానని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం కుటుంబం తరపున పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్నామని తెలిపారు.తన కంటే పదిరెట్లు అధికంగా కష్టపడి పవన్ విజయం కోసం పనిచేస్తామని చెప్పారు. పిఠాపురంలో టీడీపీ, జనసేన జెండా ఎగరాలన్నారు.కార్యక్రమంలో కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మీ విజయం ఖాయం : పవన్‌ను ఆశీర్వదిస్తున్న పండితులు



మా సమస్యలు వినన్నా : పవన్ కోసం వచ్చిన పట్టు పరిశ్రమ రైతులు

రూ.23.44 లక్షలు సీజ్..

ఆధారాలు చూపిన 21.44 లక్షలు విడుదల : కలెక్టర్

రాజమహేంద్రవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్నికల నిఘాలో భాగంగా ఎస్‌కోర్ బృందాల ద్వారా ఇప్పటి వరకూ 13 మంది నుంచి రూ.23.44 లక్షలు సీజ్ చేసి.. ఆధారాలు చూపిన తర్వాత రూ.21.44 లక్షలు విడుదల చేసినట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం జిల్లాలోని ఎన్నికల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిడదవోలులో రూ.12.88 లక్షలు, రాజమహేంద్రవరం అర్బన్‌లో రూ.2.65 లక్షలు, గోపాలపురంలో రూ.4 లక్షలు, అనపర్తితో రూ.1.06 లక్షలు, రాజమహేంద్రవరం రూరల్‌లో రూ.1 లక్ష, రాజానగరంలో రూ.1.85 లక్షలు, సీజ్ చేశామన్నారు. ఆధారాలు చూపడంతో 11 మందికి సంబంధించిన రూ.23,43,550 లు విడుదల చేసినట్టు చెప్పారు.రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు ఉంటే స్వాధీనం చేసుకుంటారని చెప్పారు. ఎన్నికల ఫిర్యాదులకు 1950 టోల్‌ఫ్రీ నంబర్‌తో పాటు కలెక్టరేట్‌లో 1800 425 2540 నెంబర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సీ విజిల్ ద్వారా 27 ఫిర్యాదులు రాగా 18 పరిష్కరించామన్నారు.

9 మంది వలంటీర్లు రాజీనామా

కడియం, మార్చి 30: కడియం మండలంలో 9 మంది గ్రామ వలంటీర్లు వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్టు ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు. కడియం గ్రామానికి చెందిన ఏడుగురు బత్తిన శ్రీధర్, నాతి జ్యోత్స్న, మేడిశెట్టి రామలక్ష్మి, వంతు సాయికుమార్, కడియం లక్ష్మీ దుర్గ, కాసాని గౌతమి, వరదా సత్యసాయిశిరీష, కడియపులంకకు చెందిన జి.దుర్గామణికంఠ ప్రసాద్, వేమగిరికి చెందిన పలివెల నాగేశ్వరరావు రాజీనామా చేశారన్నారు. వారంతా వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్టు తెలిపారని ఎంపీడీవో రాజ్‌మనోజ్ పేర్కొన్నారు.



అరెటికి.. ఏమైంది!

ధర లేక రైతు దిగాలు

- కర్పూర గెల ఒకటి రూ.100లోపే
- లాభసాటిగా లేని పంట
- గెలలు చేలోనే వదిలేస్తున్న రైతులు
- బహిరంగ మార్కెట్‌లో తగ్గని ధర
- బొంత అరటిపై కూరల ప్రభావం
- చక్కెరకేళికి తగ్గని డిమాండ్

పెరవలి, మార్చి 30 : అరె ఏమైంది.. అరటి ధర దిగజారింది.. ప్రస్తుతం పది టన్నుల కర్పూర అరటి గెలల రేటు రూ. 70 వేల నుంచి రూ.80 వేల వరకు పలుకుతోంది. అయితే ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు గెలలు కోసేందుకు ఆసక్తి చూపడంలేదు. చాలా మంది రైతులు గెలలను కోయకుండా తోటల్లో వదిలి వేస్తున్నారు. కరోనా తర్వాత అరటి ధర అంతంతమాత్రంగానే ఉంది. అడపాదడపా తప్ప ధర ఆశాజనంగా లేదు. గత రెండు, మూడేళ్లుగా అరటి తోటల పరిస్థితి ఇదేవిధంగా ఉండడంతో సాగుపై చాలా మంది రైతులు అనాసక్తి చూపుతున్నారు. ఏడాదిలో పండుగ సమయాల్లో రెండు, మూడు సార్లు మాత్రమే పది రోజులు పాటు రేటు అధికంగా ఉంటుందని.. మిగిలిన సమయాల్లో దిగజారిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తోటలు వేస్తే కనీసం పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఎకరం అరటి తోట సాగు చేసేందుకు సుమారు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చవుతుంది. వెదురు కొనుగోలు చేస్తే మరో రూ.50 వేలు అదనం. గెల ఒక్కింటికి రూ. 200 నుంచి రూ.250 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తే తమకు లాభం ఉంటుందని రైతులు చెబుతున్నారు. కానీ తరచూ మార్కెట్‌లో ఒడిదుడుకులు వల్ల ప్రస్తుతం వంద రూపాయలకు కూడా కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో రైతులు లబోదిబోమం టున్నారు. గతంలో గెల ఒక్కటి రూ.150 నుంచి రూ.200 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్ లేకపోవడం వల్ల వాటిని కూడా కోయకుండా వదిలి వేస్తున్నారు. అరటి తోటలు విషయమై ప్రభుత్వం ఎటువంటి శ్రద్ధ తీసుకోకపోవడంతో తరచూ నష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. అయితే బహిరంగ మార్కెట్‌లో మాత్రం ధర తగ్గలేదు. డజను రూ. 30 నుంచి రూ.40లకు విక్రయిస్తున్నారు. చక్కర కేళి అరటి ధర మాత్రం ఆశాజన కంగానే ఉంది. అయితే చక్కరకేళి సాగు తక్కువగా ఉంటుంది. అయితే చక్కరకేళీ అరటి పండును ఎక్కువగా ఇష్టపడతారు.డిమాండ్ తగిన ఉత్పత్తి లేకపోవడంతో ఎప్పుడూ ధర ఆశాజ నకంగా ఉంటుంది. అదే విధంగా బొంత అరటి ధర తక్కువగానే ఉంది. కూరగాయల ధరల ప్రభావం బొంత అరటిపై పడింది.

నాలుగేళ్లుగా నష్టమే..



అరటి తోటలతో పూర్తిగా నష్టపోతున్నాం. అలవాటైన పంట కాబట్టి అరటి సాగును వదులుకో లేకపోతున్నాం. గత నాలుగేళ్లుగా నష్టాలతోనే అరటి తోటలు సాగు చేస్తున్నాం. ప్రభుత్వం వెదురుగెడలను రైతులకు సబ్సిడీపై సరఫరా చేసి ఆదుకోవాలి. మద్దతు ధర వచ్చేలా చూడాలి.

-నారాయణరావు, రైతు, తీపర్రు

తీళ్లు..మారరా!

కోడ్ వచ్చినా.. ఇష్టానుసారంగా..



వీధివీధినా ఇంతేగా : సీతానగరంలో ఇంటికి గోడకు.. గేటుకు అతికించిన వైసీపీ స్టిక్కర్లు

సీతానగరం, మార్చి 30 : కోడ్ కూసినా వైసీపీ నాయకుల్లోమాత్రం మార్పు కానరావడంలేదు.. ఎన్నికల కమిషన్ వద్దన్నా అవే పనులు చేస్తున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో నాయకుల చిత్రపటాలు కనిపించకూడదని ప్రభుత్వ కార్యాలయాల్లోనే తొల గించారు...ఈ మేరకు బహిరంగ ప్రదేశాల్లో కటౌట్లు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగించారు. అయినా వైసీపీ నాయకులు మాత్రం అంతా మా ఇష్టం అంటున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన స్టిక్కర్లు మాత్రం ఎక్కడబడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలో సీఎం జగన్.. ఎమ్మెల్యే రాజా చిత్రాలతో గోడలు.. గేట్లకు అతికించిన ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. ఎన్నికల షెడ్యూలు విడుదలైనా వారేం పట్టించుకోవడం లేదు. తమ దారి తమదే అంటున్నారు. వీళ్ల ఏమైనా కొత్త నాయకులా అంటే అదీ కాదు.. అయినా తీరు మాత్రం మామూలే. ప్రచారంలో భాగంగా అధికార వైసీపీ నాయకులు ఇంటింటికి వెళుతూ గోడలు.. గేట్లకు సైతం సిక్టర్లు అతికి స్తున్నారు. వైసీపీ నాయకులు నిబంధనలను తుంగలో తొక్కుతూ ఎన్నికల అధికారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వైసీపీ కార్యకర్తలు తమకు ఎదురులేదన్నట్టు నిబంధనలు పక్కన బెట్టి ఇష్టానుసారం చేస్తున్నారు.ఇప్పటికే వైసీపీ నాయకుల ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై జనసేన, తెలుగుదేశం నాయకులు ఆన్‌లైన్ ఫిర్యాదు చేశారు.



బిక్కవోలు మండలం పందలపర్రులో రిక్షాపై తల్లిని కూర్చోబెట్టి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న నల్లమిల్లి

అనపర్తి సీటుపై పునరాలోచన చేయండి

- టీడీపీని కాపాడుకోవాలన్న సంకల్పంతోనే యాత్ర
- రెండో రోజు పందలపర్రులో నల్లమిల్లి

అనపర్తి, మార్చి 30 : అనపర్తిలో తెలుగుదేశం పార్టీని కాపాడుకోవాలన్న సంకల్పంతోనే న్యాయం కోసం నల్లమిల్లి అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తి అసెంబ్లీ సీటుపై నియోజకవర్గంలో చెలరేగిన మంటలు నేటికీ చల్లారలేదు. సీటు మార్పు చేయడంపై ప్రజాభిప్రాయ సేకరణకు కుటుంబంతో కలిసి గ్రామాల పర్యటన చేపట్టిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రెండో రోజైన శనివారం బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో పర్యటించారు. నాయకులు, కార్యకర్తలు ఆయన కుటుంబంతో గ్రామంలో పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.ఈ మేరకు మీ వెంటే మేమంతా ఉంటామని ప్రజలు నల్లమిల్లి కుటుంబానికి భరోసా ఇచ్చారు. వృద్ధాప్యంలో ఉన్న తన తల్లి సత్యవతిని రిక్షాలో కూర్చోబెట్టి నల్లమిల్లి రిక్షా లాగుతూ ముందుకు సాగారు.దీనిలో భాగంగా నల్లమిల్లి మీడియాతో మాట్లాడుతూ పొత్తుల్లో భాగంగా ఒక్క సీటు కూడా కోల్పోకూడదని.. రాష్ట్రంలో వైసీపీ పోవాలని అనపర్తిలో తెలుగుదేశం నిలవాలన్నదే తన కోరిక అన్నారు. మూడు పార్టీల అధినేతలు మరొకమారు ఆలోచన చేసి గెలుపు దిశగా ఉన్న అనపర్తి నియోజకవర్గాన్ని చేజేతులా పాడుచేయవద్దని కోరారు. నియోజకవర్గంలో అంచెలంచెలుగా టీడీపీని బలోపేతం చేస్తూ గెలుపు దిశగా పయనింపజేసే సమయంలో ఇటువంటి అవాంతరం ఏర్పడడం దురదృష్టకరమన్నారు. అనపర్తిలో టీడీపీని రక్షించేందుకు అధినేత ఆలోచన చేస్తారన్న నమ్మకం తనకుందన్నారు. సీటు మార్చిన నాటి నుంచి నా వెన్నంటి ఉంటున్న కార్యకర్తల మేలు మరచిపోలేనన్నారు.ఆయన వెంట నల్లమిల్లి కుటుంబం, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొవ్వూరు సమావేశంలో పాల్గొన్న అచ్చిబాబు, ముప్పిడి

వైసీపీ పాలనపై ప్రజల్లో విసుగు

▸▸ టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి

కొవ్వూరు, మార్చి 30: వైసీపీ పాలనపై ప్రజలు విసుగు చెందారని, ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గ టీడీపీ-జనసేన- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యం లో శనివారం కొవ్వూరులోని 5, 6 వార్డుల్లో ఆయన పర్యటించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్, సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమితోనే రాష్ట్ర, భావితరాల భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి పూర్తికావాలన్నా, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, యువతకు ఉద్యోగాలు రావాలన్నా కూటమితోనే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

● స్థానిక యువరాజ్ కళ్యాణ మండపంలో నిర్వహించిన కూటమి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం సందర్భంగా కొవ్వూరు మండలానికి చెందిన కోమటి కృష్ణంరాజు, కోమటి సత్యనారాయణ, సిరిబొమ్మల రాము, బెజవాడ వెంకటేశ్వరరావు, వీరమళ్ళ గోపికృష్ణ, వీరమళ్ల సూరిబాబు వైసీపీ నుంచి టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పెండ్యాల అచ్చిబాబు మాట్లాడుతూ ఒక్కచాన్స్‌పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో అన్నివ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్మోహనరెడ్డి రాక్షసపాలన అంతమొందించడానికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయన్నారు. ఐదేళ్లుగా ప్రజల దగ్గర దోచుకున్న డబ్బును ఎన్నికల్లో ఓటును కొనడానికి తీసుకు వస్తున్నారన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల మార్పు తన చేతిలో లేదని, అయితే నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరిగితే తాను బయటకు వస్తానని అచ్చిబాబు అన్నారు. ఎమ్మెల్యేలు తనకు గాని, తన పరిశ్రమకు గాని ఏమీ చేయనవసరం లేదని, ప్రజలకు, నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, టీడీపీ పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాసరావు, సూర్యదేవర రంజిత్, జనసేన నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, డేగల రాము, అచ్యుతరాయుడు, గంగుమళ్ల స్వామి, సుంకర సత్తిబాబు, బీజేపీ నాయకులు పరిమి రాధాకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బీవీ ముత్యాలరావు, ఎం.రామచంద్రరావు, పెరుగు పోతురాజు, పిక్కి నాగేంద్ర పాల్గొన్నారు.



తాళ్లపూడిలో టీడీపీలో చేరిన నాయకులతో ముప్పిడి

టీడీపీలో చేరికలు

తాళ్లపూడి, మార్చి 30: మండలంలోని అన్నదేవరపేటలో శుక్రవారం రాత్రి టీడీపీ యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, టీడీపీ ప్రతినిధి జీవీ ప్రసాద్‌ల సమక్షంలో టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమావేశం జరిగింది. దీనికి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఇందిరమ్మ కాలనీ, అరుంధతీపేటలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి ముప్పిడి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మార్పు అన్నదేవరపేట నుంచే మొదలైందని, కూటమి విజయానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు.

జగన్ పాలనలో వ్యవస్థలు నాశనం: మద్దిపాటి

దేవరపల్లి, మార్చి 30: మండలంలోని గౌరీపట్నం, దేవరపల్లి గ్రామాల్లో కూటమి నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాల దోచుకున్నారని, అన్ని వ్యవస్థలను నాశనం చేశారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం మైనింగ్, ఇసుక, డ్రగ్స్ మాఫియా తయారు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. క్వారీ, క్లస్టర్స్ ఆర్థికంగా దెబ్బతిన్నాయని, వేలాది మంది క్వారీ కార్మికులు పనిలేక ఆకలితో అలమటిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు ఓటమి తప్పదని, ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, అధికారం లోకి రాగానే అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, గన్నమని హరికృష్ణ, కొఠారు ధ్రువకాంత్, నరసింహ, పాతూరి గిరిధర్, ఉప్పులూరి రాంబాబు, కాట్రు భీమరాజు, బీజేపీ నాయకులు అనిశెట్టి గంగరాజు, కంబాల సత్తిబాబు పాల్గొన్నారు.



గౌరీపట్నంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మద్దిపాటి

కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో
త్వరలో కంటి శస్త్రచికిత్సలు



సబ్‌కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

▸▸ కొవ్వూరు సీహెచ్‌సీలో దాతల సహకారంతో పరికరాలు ఏర్పాటు

▸▸ జిల్లా కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు, మార్చి 30: కొవ్వూరు ఆసుపత్రిలో కాటరాక్ట్ వంటి ఆధునిక కంటి శస్త్రచికిత్సలు అందుబాటులోకి తీసుకురానున్నామని, దానిలో భాగంగా దాతల సహకారంతో పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. శనివారం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిని ఆమె తనిఖీ చేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా డెక్కన్ కెమికల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఎండీ జి.మనోహర్ సమకూర్చిన రూ.20 లక్షల విలువైన కంటి పరీక్షా, శస్త్రచికిత్స పరికరాలు, ఆప్తాలిక్ పరికరాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రారంభించారు. మనోహర్ సేవలను కొనియాడారు. అనంతరం ప్రసూతి వార్డును పరిశీలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిని ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత అధిగమించేందుకు ఐరన్ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో కంటి వైద్యులు డాక్టర్ శాంతికమల, అనపర్తి ఆసుపత్రి కంటి వైద్యులు డాక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్సలు అందించనున్నట్టు కలెక్టర్ మాధవీలత చెప్పారు.

సబ్ కలెక్టర్ క్యాంపు ఆఫీస్ భవనం ప్రారంభం

కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సబ్ కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని కలెక్టర్ మాధవీలత ప్రారంభించారు. పండితులు వేదమంత్రాలతో కలెక్టర్‌కు స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డెక్కన్ కెమికల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఎండీ జి.మనోహర్, ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ కె.సాయికిరణ్, కంటి వైద్యులు శాంతి కమల, డివిజనల్ హౌసింగ్ అధికారి జి.పరశురామ్, ఏఈ చక్రవర్తి, ఆర్డీవో కార్యాలయ ఇన్‌చార్జి ఏవో కె.రవివిక్రమ్, సీహెచ్‌సీ, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్లలో ఘనంగా డాక్టర్స్ డే



నల్లజర్ల పీహెచ్‌సీలో డాక్టర్లను సత్కరించిన సిబ్బంది

నల్లజర్ల, మార్చి 30: ప్రజల ఆరోగ్య ప్రదాత వైద్యుడేనని వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీబ ప్రసాద్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం నల్లజర్ల పీహెచ్‌సీలో డాక్టర్లు తెల్లం గంగాధర్, డాక్టర్ సిరాజ్ ఉద్దీన్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మనిషికి ప్రాణం పోసేది తల్లియని, అయితే ఆ మనిషికి ప్రాణాపాయం వస్తే పునర్జన్మ ప్రసాదించేది మాత్రం వైద్యులేనని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభించిన టీడీపీ నాయకులు

గోపాలపురం, మార్చి 30: బాట సారుల దాహార్తి తీర్చడానికి చలి వేంద్రాలు దోహద పడతాయని టీడీ పీ నాయకులు జ్యేష్ట శ్రీధర్, మద్ది పాటి రమేష్ అన్నారు. గోపాలపురం చెక్ పోస్టు సెంటర్‌లో మద్దిపాటి గంగరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారులు మద్దిపాటి సతీష్, రమేష్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జ్యేష్ట శ్రీను, రాము, శ్రీను, గెల్లా శ్రీనుబాబు, రామలీలాధర్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నిడదవోలులో ఉచిత వైద్య శిబిరం



నిడదవోలు, మార్చి 30: రోటరీక్లబ్ నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని అధ్యక్షుడు కీర్తి అంజనేయులు అన్నారు. శని వారం నిడదవోలులోని గాంధీనగర్‌లో రోటరీ ఆధ్వర్యంలో ఉచిత షుగర్, రక్త పోటు వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీవిద్య 94 మందికి పరీక్షలు చేశారు. తరచుగా వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆహార నియమాలు పాటిస్తే షుగర్ వ్యాధి అదుపులో ఉంటుందన్నారు. ఉజ్జిన జవహర్ లాల్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో గొన్నాబత్తుల రామారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, పొన్నా సుబ్రహ్మణ్యం, కాళ్ల రాంబాబు, శివకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీ గుండెపోటుతో మృతి



చంద్రమ్మ(ఫైల్)

గోపాలపురం, మార్చి 30: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ సొంగా చంద్రమ్మ(62) గుండెపోటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఉపాధి హామీ పనుల్లో భాగంగా శనివారం ఉదయం పనులు చేస్తుండగా ఛాతిభాగంలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయింది. తోటి కూలీలు ఇంటికి తీసుకురాగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఆటోను పిలిచేలోపే ఆమె మృతి చెందినట్టు తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, మార్చి 30: కారు ఢీకొని ఇద్దరు గాయపడినట్టు ఎస్‌ఐ జుబేర్ మహమ్మద్ తెలిపారు. కొవ్వూరుకు చెందిన కోటిచుక్కల సత్యనారాయణమూర్తి ఈ నెల 29వ తేదీ రాత్రి రాజమండ్రిలో పని ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గ మధ్యలో ఖండవల్లి జీటీ శ్యామ్యూల్ లిఫ్టు అడిగితే బైక్ ఎక్కించుకుని బయలుదేరాడు. రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు వైపున ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఇద్దరూ బైక్ పైనుంచి కిందపడి పోవడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను 1087 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసునమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

క్వారీ లారీ ఢీకొని..

కొవ్వూరు మండలం చిడిపి గ్రామానికి చెందిన చిట్టూరి వెంకట్రావు, రోజారాణి బైక్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి బయలుదేరారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద వెనుక నుంచి వస్తున్న క్వారీ లారీ ఢీకొట్టింది. దీంతో రోజారాణి తలకు, ముఖంపై గాయాలు కాగా, వెంకట్రావు కాలుకు తీవ్ర గాయాల య్యాయి. వారిని స్థానికులు కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం రాజమహేంద్రవరం తరలించారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

గోపాలపురం, మార్చి 30: బైక్ ఢీకొనడంతో ఓ మహిళ తీవ్ర గాయాలపాలైంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గోపాలపురం గ్రామానికి చెందిన కొప్పసాని నాగలక్ష్మి కొంతకాలంగా దేవరపల్లి శివారులో ఉన్న అవంతి ఫ్యాక్టరీలో పని చేస్తోంది. శనివారం ఉదయం తన కుమారుడితో కలిసి బైక్‌పై డ్యూటీకి వెళ్తుండగా ఫ్యాక్టరీ వద్ద లోపలికి తిరుగుతున్న సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో నాగలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అసమర్థ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలి

కందుల దుర్గేష్, బూరుగుపల్లి శేషారావు

పెరవలి, మార్చి 30: అసమర్థ అవినీతి ప్రభుత్వాన్ని తరిమి కొట్టడానికి అందరూ ఐక్యంగా పని చేయాల్సిన అవసరం ఉందని కూటమి నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్, టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాపవరం, నల్లాకులవారిపాలెం, కాకరపర్రు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే రాజకీయాలను పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేసి కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాల న్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి బోగవల్లి ప్రసాద్, మండలాధ్యక్షుడు పిప్పర రవి, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

▸▸ పింఛన్ల విధుల నుంచి వలంటీర్లను తప్పించిన ఈసీ

▸▸ సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకోవాలని ఆదేశం

▸▸ సచివాలయ ఉద్యోగులతో పంపిణీచేయించే యోచన?

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి) అధికార వైసీపీకి ఎన్నికల కమిషన్ తేరుకోలేని షాక్ ఇచ్చింది. పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి వలంటీర్లను తప్పించింది. అంతేకాక వారి వద్ద ఉన్న ప్రభుత్వం సెల్‌ఫోన్లను కూడా వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. దీంతో జిల్లాలోని వైసీపీ నేతల్లో కలకలం మొదలైంది. వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించి.. అదే సమయంలో ఓటు వైసీపీకి వేయవలసిన అవసరం గురించి చెప్పించడానికి వైసీపీ పెద్ద కుట్ర చేసిన సంగతి తెలిసిందే. వలంటీర్లతో చెప్పిస్తే కొంద రైనా వింటారనే ఆలోచనతో వైసీపీ నేతలు వారితో పబ్బం గడుపు కోవాలని వ్యూహం పన్నారు. మొదట్లో రాజకీయ పార్టీల సమావేశా లకు వెళ్లవద్దని ఆదేశించినా నేతల ఒత్తిళ్ల వల్ల కొందరు వెళ్లి ఆ కాస్త ఉద్యోగం పోగొట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ విధంగా రాజ మహేంద్రవరంలో 24 మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి వారితో పని చేయించుకునే ఆలోచన కూడా వైసీపీ నేతలు కొందరు చేశారు. దీంతో 16మంది వలంటీర్లు రాజీనామా చేశారు. అంతేకాక ఎన్ని కల ముందు ఏప్రిల్ 1, మే 1వ తేదీల్లో కూడా పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నందున వారికి వలంటీర్లతో పింఛన్లు ఇప్పించి, ఓటు వైసీపీకి వేయాలని చెప్పించే ప్రయత్నంలో ఉన్నారు. ఇది పసిగట్టిన ఎన్నికల కమిషనర్ జోక్యం చేసుకుని, పింఛన్ల పంపిణీలో వలంటీర్ల పాత్ర ఉండకూడదని, వారి నుంచి ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు కూడా స్వాధీనం చేసుకోవాలని, ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. వలంటీర్ల ఫోన్లలో తన పరిధి లోని ఓటర్ల పూర్తి వివరాలు ఉంటాయి. వారితో వాట్సప్ గ్రూపు కూడా ఏర్పాటు చేశారు.ప్రతి సమాచారం వాట్సప్ ద్వారా అంది స్తున్నారు. ఇక వాట్సప్, ఫోన్, మెసేజ్ ద్వారా కూడా ఓటర్లను ప్రభావితంగా చేయకుండా ఉండే విధంగా వారి ఫోన్లను స్వాధీనం చేసుకోమని ఆదేశించింది. దీంతో వైసీపీ కంగారు పడుతోంది. జిల్లాలో సుమారు రెండు లక్షల 45 వేలు పింఛన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 9146 మంది వలంటీర్లు వీటిని పంపిణీ చేసేవారు. ఇటీవల వారీ సంఖ్య బాగా తగ్గింది. ఇవాళ వీరిని ఆపేయడంతో పాటు వాటన్నింటిని ఒకటి నుంచి పంపిణీ చేయడానికి అధికా రులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగు లతో ఈ పంపిణీ చేయించే ఆలోచన చేస్తున్నారు. ఉన్నతాధికార్ల నుంచి ఏ గైడ్‌లైన్స్ వస్తాయోనని ఎదురు చూస్తున్నారు.

విశ్వప్రసాద్ పదవీ విరమణ సభ

ఉండ్రాజవరం, మార్చి 30: ఉండ్రాజవరం హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు వారణాశి విశ్వప్రసాద్ పదవీ విరమణ సభ శనివారం సాయంత్రం హైస్కూలులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్యారంగానికి అందించిన సేవలను, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో చేసిన కృషిని యూటీఎఫ్ జిల్లా నాయకుడు ఐ.రాంబాబు వివరించారు. అనంతరం విశ్వప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, ఎంఈవోలు సక్సేనరాజు, శారదా జ్యోత్స్న వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ కార్మికులకు మద్దిపాటి మద్దతు

దేవరపల్లి, మార్చి 30: మెరుగైన వేతన ఒప్పందం కోసం లారీ కార్మికులు మండలంలోని దుద్దుకూరులో చేస్తున్న సమ్మె శనివారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్వారీ కార్మికులు, లారీడ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కే మస్తాన్, ఆకాష్, బాజీ, కొండయ్య, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

ఉండ్రాజవరం, మార్చి 30: ఉండ్రాజవరంలోని బౌద్ధ దమ్మపీఠంలో ఏప్రిల్ 5 తేదీ నుంచి ఉచిత పాలిసెట్ కోచింగ్ ఇస్తున్నట్టు పీఠం అధిపతి భంతె అనాలయో శనివారం తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ కోర్సులు చదవాలనుకునే వారు వినియోగించుకోవాలని కోరారు. ఈ కోచింగ్ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందని, ఆసక్తి ఉన్న టి.కృష్ణ, 9866848509 నెంబరును సంప్రదించాలని చెప్పారు.

ట్రావెల్ బస్సులో 679 చీరలు పట్టివేత



జగన్నాథపురంలో పట్టుబడ్డ చీరల బాక్స్‌లను చూపిస్తున్న పోలీసులు

గోపాలపురం, మార్చి 30: సాధారణ ఎన్నికల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం జగన్నాథపురం శివారులో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల చెక్‌పోస్టు వద్ద శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కోయలగూడెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సులో 679 చీరలు పట్టుబడినట్టు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు. చీరలను స్వాధీనం చేసుకుని కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించామన్నారు. తనిఖీల్లో పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.